


ఉదయగిరిలో టీడీపీ శ్రేణుల ప్రదర్శన


నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


నగర కమిషనర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నగర అభ్యర్థి నారాయణ, పక్కన కోటంరెడ్డి


ఉదయగిరిలో కాకర్ల సురేష్..

నామినేషన్ల కోలాహలం

● ఒక్కరోజునే 32 మంది.. 43 సెట్ల నామినేషన్ల దాఖలు

నెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ అడపా దడపా మాత్రమే నామినేషన్లు దాఖలవుతూ వచ్చాయి. అయితే సోమవారం ఒక్కరోజునే భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 32 మంది అభ్యర్థులు.. 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.


నెల్లూరు నగరంలో టీడీపీ కార్యకర్తల ప్రదర్శన

నెల్లూరు ఎంపీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలెక్టరేట్‌లో తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి హరినారాయణన్‌కు అందజేశారు. ఆయన 2 సెట్లు వేశారు. నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ కూడా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నారాయణకు డమ్మీగా ఆయన సతీమణి రమాదేవి ఒక సెట్ నామినేషన్ వేశారు. నెల్లూరు సిటీ వైసీపీ అభ్యర్థి మహ్మద్ ఖలీల్ అహ్మద్ తరఫున ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నామినేషన్ వేశారు. నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. సర్వేపల్లి వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు వేశారు.


ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి

ఆయనకు డమ్మీగా కుమార్తె కాకాణి పూజిత రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 4 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అలానే వైసీపీ అభ్యర్థి మేక పాటి విక్రమ్‌రెడ్డి తరఫున ప్రొపోజర్లు ఒక సెట్ నామినేషన్ వేశారు. కందుకూరులో వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా వైసీపీ తరఫున తాడికొండ రాంబాబు నామినేషన్ దాఖలు చేశారు. వీరితోపాటు ఇతర పార్టీల తరఫున అభ్యర్థులు, స్వతంత్రులు నామినేషన్లు వేశారు.

అరె.. పత్రాలేవీ!?

● ఉదయగిరిలో వెనుతిరిగిన కాంగ్రెస్ అభ్యర్థి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22 : సరియైన పత్రాలు లేకపోవడంతో ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థి సోము అనిల్ కుమార్‌రెడ్డి ఆర్వో కార్యాలయం నుంచి వెనుతిరగాల్సి వచ్చింది. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల రాజు, డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిలతో కలిసి అనిల్ తహసీల్దారు కార్యాలయానికి చేరుకొన్నారు. అయితే సరైన పత్రాలు లేకపోవడం, సమయం ముగియడంతో నామినేషన్ వేయకుండానే అక్కడ నుంచి వెనుతిరగాల్సి వచ్చింది.

అఫిడవిట్లలో ఏమున్నాయంటే!

నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు

నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ కుటుంబ ఆస్తులు రూ.824 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నారాయణ పేరు మీద రూ.78.66 కోట్లు, ఆయన సతీమణి రమాదేవి పేరు మీద రూ.100.87 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అలానే నారాయణ పేరుపై రూ.207.50 కోట్ల స్థిరాస్తులు, రమాదేవి పేరుపై రూ.437.02 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు చూపించారు. ఇక నారాయణకు రూ.62.43 కోట్లు, రమాదేవికి రూ.127.16 కోట్ల అప్పులు ఉన్నాయి. అదేవిధంగా నారాయణపై 8 కేసులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రస్తావించారు.

● వేమిరెడ్డి ఆస్తులు రూ.716 కోట్లు

నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కుటుంబ ఆస్తులు రూ.716 కోట్లు. అందులో వీపీఆర్ పేరుపై రూ.464.43 కోట్లు, ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డి పేరుపై రూ.46.94 కోట్ల చరాస్థులు ఉన్నాయి. అలానే ప్రభాకర్‌రెడ్డి పేరు మీద రూ.174.83 కోట్లు, ప్రశాంతిరెడ్డి పేరు మీద రూ.30.11 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. అదే విధంగా వీపీఆర్‌కు రూ.153.81 కోట్ల అప్పులు, ప్రశాంతి రెడ్డికి రూ.43.48 కోట్ల అప్పులు ఉన్నట్లు వేమిరెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటితోపాటు వీపీఆర్‌పై ఆరు కేసులు కూడా ఉన్నాయి.

● ఆదాల ఆస్తులు రూ.312 కోట్లు

నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి రూ.312 కోట్లు ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో ఆదాల పేరుపై రూ. 41.11 కోట్లు, ఆయన సతీమణి వింధ్యావళి పేరుపై రూ.85.46 కోట్లు చరాస్తులు ఉన్నట్లు చూపించారు. అలానే ఆదాల పేరుపై రూ.136.66 కోట్లు, సతీమణి పేరుపై రూ.48.70 కోట్లు స్థిరాస్తులున్నాయి. అదేవిధంగా ఆదాలకు రూ.12.16 కోట్లు, ఆయన సతీమణికి రూ.3.48 కోట్ల అప్పులు ఉన్నట్లు ప్రస్తావించారు.

● ఆనం ఆస్తులు రూ.26 కోట్లు

ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి ఉమ్మడి కుటుంబం ఆస్తులు రూ.26 కోట్లుగా అఫిడవిట్‌లో చూపించారు. ఆనం పేరు మీద రూ.45.04 లక్షలు, ఆయన సతీమణి శిరీష పేరుపై రూ.32.84 లక్షలు చరాస్తులు ఉన్నాయి. అలానే ఆనం పేరుపై రూ15.80 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.9.70 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా రామనారాయణరెడ్డి పేరుపై రూ29.58 లక్షల అప్పులు కూడా ఉన్నాయి. ఇక రామనారాయణరెడ్డిపై ఒక కేసు ఉంది.

● సురేష్ ఆస్తులు రూ. 27 కోట్లు

ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకార్ల సురేష్ కుటుంబం ఆస్తుల విలువ రూ.27.44 కోట్లుగా అఫిడవిట్‌లో నమోదు చేశారు. అందులో చరాస్తులు సురేష్ పేరుపై రూ.4.29 కోట్లు, ఆయన సతీమణి లక్ష్మీ ప్రవీణ పేరుపై రూ.4.90 కోట్లు ఉన్నాయి. అలానే సురేష్‌కు రూ.10.85 కోట్లు విలువైన స్థిరాస్తులు, ఆయన సతీమణికి రూ.7.40 కోట్ల స్థిరాస్తులున్నట్లు చూపించారు. అదేవిధంగా సురేష్ పేరుపై రూ.3.28 కోట్ల అప్పు కూడా ఉంది. ఇక జలదంకి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు సురేష్‌పై నమోదై ఉంది.

● కాకాణిపై ఏడు కేసులు

సర్వేపల్లి వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఏడు కేసులు నమోదై ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక కాకాణి కుటుంబం ఆస్తులు రూ.28.66 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో గోవర్ధన్‌రెడ్డి పేరు మీద రూ.2.43 కోట్లు, ఆయన సతీమణి విజిత పేరు మీద రూ.2.36 కోట్ల విలువైన చరాస్తులున్నట్లు చూపించారు. అలానే గోవర్ధన్‌రెడ్డిపై రూ.13.70 కోట్లు, ఆయన సతీమణి పేరుపై రూ.10.17 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. వీరికి ఎటువంటి అప్పులు లేవు.

● విక్రమ్‌రెడ్డిపై ఎనిమిది కేసులు

ఆత్మకూరు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై దేశవ్యాప్తంగా ఎనిమిది కేసులు ఉన్నాయి. ఇక విక్రమ్‌రెడ్డిపై రూ.76.71 కోట్లు, ఆయన సతీమణి వైష్ణవి రెడ్డిపై రూ.15.32 కోట్లు చరాస్తులు ఉన్నాయి. అలానే విక్రమ్‌రెడ్డి పేరు మీద రూ. 114.62 కోట్లు, ఆయన సతీమణి పేరు మీద రూ2.57 కోట్ల విలువైన స్థిరాస్తులు కూడా ఉన్నాయి. వీరికి రూ.34 కోట్లు అప్పులు కూడా ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు.

● ఖలీల్ అహ్మద్ ఆస్తులు 22 లక్షలు

నెల్లూరు సిటీ వైసీపీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ కుటుంబం ఆస్తులు రూ. 22.18 లక్షలు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. ఖలీల్ పేరుపై రూ.16.25 లక్షలు, ఆయన సతీమణి పేరుపై రూ.4.26 లక్షలు, కుమారుడి పేరుపై రూ.1.67 లక్షల విలువైన చరాస్తులు ఉన్నాయి. అయితే రూపాయి విలువ చేసే స్థిరాస్తి కూడా లేదని చూపించారు.

'పది'లో 15వ స్థానం

- ● టెన్త్‌లో 27,788 మంది పాస్
- ● జిల్లాలో ఉత్తీర్ణత శాతం 88.17
- ● ఈ ఏడాది కూడా బాలికలదే హవా
- ● గతేడాది కంటే దిగజారిన ఫలితాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. గత ఏడాది జిల్లాకు 9వస్థానం రాగా, ఈ ఏడాది దిగజారి 15వ స్థానంలో నిలిచింది. అయితే గత ఏడాది సాధించిన 75.61 శాతం ఉత్తీర్ణత కంటే కొంత మెరుగుపడి 88.17 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలికలు తమ హవా చాటారు. జిల్లాలో ఏపీ మోడల్ స్కూల్స్ 2, ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 4, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 2, ఏపీటీడబ్ల్యుఆర్ఈఐ సొసైటీ స్కూల్స్ 2, కేజీబీవీలు 4, జిల్లా పరిషత్ 23, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ 143 కలిపి మొత్తం 180 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. అలాగే 8,591 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించగా 20,201 మంది ప్రథమస్థానం, 3,019 మంది ద్వితీయస్థానం, 1,268 మంది తృతీయస్థానం సొంతం చేసుకున్నారు.

● 88.17 శాతం ఉత్తీర్ణత

పదోతరగతి పరీక్షలకు ఈ ఏడాది జిల్లాలో 27,788 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకాగా, 24,500 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 13,926 మంది హాజరు కాగా 12,003 మంది ఉత్తీర్ణతతో 86.19 శాతం ఫలితాలు సాధించారు. బాలికల్లో 13,862 మంది హాజరుకాగా 12,497 మంది ఉత్తీర్ణతతో 90.15 శాతంగా నమోదైంది. బాలుర కంటే బాలికలే కొంత మెరుగైన ఫలితాలు దక్కించుకున్నారు. మొత్తం మీద బాల, బాలికలు కలిపి జిల్లాలో 88.17 శాతం ఉత్తీర్ణత పొందారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా అంతా ఊహించిన విధంగానే పదిలో జిల్లా స్థానం తగ్గుతుందని భావించారు. డీఈవో గంగాభవాని గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది సైతం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి డీఈవో ఆదేశాలకు అనుగుణంగా కట్టుదిట్టం చేశారు. అయితే ముందుగానే పరీక్షలు పకడ్బందీగా ఉంటాయని భావించిన ఆయా యాజమాన్యాల విద్యార్థులు తమ శక్తి మేరకు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో గతంలో కంటే ఈ ఏడాది అత్యధికంగా ప్రథమస్థానంలో ఉత్తీర్ణత పొందారు..

● అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు..

జిల్లాలో ఈ ఏడాది 16 మంది విద్యార్థులు అత్యధిక మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. చలువాది వెంకట సుభాష్‌చంద్ర 598, రాపూరు గణేష్, కందుకూరు మహిక 597, చల్లా చాతుర్య, గుణపాటి ధనుష్, తలిశెట్టి హేమశ్రీ, వీరబొమ్మ నిరూపమ, వేలూరు భవ్య, గూడూరు అక్షిత, యెండ్లూరి చరణ్‌లు 596, రెడ్డప్పగారి శ్రీనిధి, ఓకారం యశస్విని, బొక్కసం సాయిహర్షిణి, శంకవరం లక్ష్మీశ్రీ, షేక్.సాయికిరణ్, నంబూరి సాయిచరణ్‌లు 595 మార్కులు సాధించారు. అలాగే ఈ ఏడాది జడ్పీ, మున్సిపాలిటీ, ప్రభుత్వ పాఠశాలల్లో జడ్పీ విభాగంలో బుచ్చి ఎంపీపీ పాఠశాలకు చెందిన షేక్.ఆయేషా సిద్దిక్, చింతల లక్ష్మీకీర్తనలు 592 మార్కులు, మునిసిపల్ విభాగంలో నగరంలోని బీవీనగర్ మునిసిపల్ పాఠశాలకు చెందిన కె.స్వాతి శ్రీనిధి 594, పప్పులవీధి మునిసిపల్ పాఠశాల విద్యార్థి ఎం.జశ్వంత్‌రెడ్డి 592 మార్కులు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఇందుకూరుపేట ఎంకేఆర్ పాఠశాలకు చెందిన బి.ఉమేష్‌చంద్ర 591, ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన పఠాన్‌సోనీ 586 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు.

● 20,201 మందికి ప్రథమస్థానం..

జిల్లాలో గత ఏడాది 16,466 మంది ప్రథమస్థానం సాధించగా ఈ ఏడాది 20,201 మంది ప్రథమస్థానం దక్కించుకున్నారు. అలాగే 3,019 మంది ద్వితీయస్థానం, 1,268 మంది తృతీయస్థానం దక్కించుకున్నారు. వీరిలో తెలుగులో 314, ఇంగ్లీష్‌లో 47 మంది, మ్యాథ్స్‌లో 1714 మంది, సైన్స్‌లో 271 మంది, సోషల్‌లో 520 మంది వందశాతం మార్కులు సాధించారు. అలాగే 500-550లోపు 5,086 మంది, 551-560లోపు 969 మంది, 561-570లోపు 932 మంది, 571-580 లోపు 903 మంది, 581-590 లోపు 598 మంది, 591-600 లోపు 103 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు దక్కించుకున్నారు. అలాగే ఏపీఎంఎస్‌లో 213 మంది, ఏపీఆర్‌లో 142 మంది, ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌లో 174 మంది, ఏపీటీడబ్ల్యుఆర్‌లో 9 మంది, సెంట్రల్ స్కూల్స్‌లో 2, కేజీబీవీల్లో 62 మంది, జడ్పీలో 1,283మంది, మునిసిపాలిటీల్లో 316 మంది, ఎయిడెడ్‌లో ఏడుగురు, ప్రభుత్వ పాఠశాలల్లో 77 మంది, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్‌లో 6,306 మంది కలిపి మొత్తం 8,591 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు.

● మెరుగైన ఫలితాలు సాధించాం : డీఈవో

ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాం. తమ శక్తి మేరకు నాణ్యమైన ఫలితాలు వెలువడ్డాయి. వచ్చిన ఫలితాలన్నీ కూడా నిజాయితీగా విద్యార్థులు సాధించుకున్నవే. ఇందులో ఎలాంటి అనుమానం లేదు.వారి ప్రతిభ ఆధారంగా దక్కించుకన్న ఫలితాలు సంతృప్తినిచ్చాయి.మున్ముందు మరింత ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

● రీకౌంటింగ్-రీవెరిఫికేషన్‌కు సూచనలు.

విద్యార్థులు జవాబుపత్రాల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 23 నుంచి 30వతేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రీకౌంటింగ్ ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500లు, జవాబు పత్రాల రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కు రూ.1000లను చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో, సంబంధిత పాఠశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

● మే 24 నుంచి సప్లిమెంటరీ

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను మే 24 నుంచి జూన్ 3 వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఈనెల 23వతేదీ నుంచి 30వతేదీలోగా ఎలాంటి అపరాధ ఫీజు చెల్లించాలన్నారు. అలాగే రూ.50ల అపరాధ రుసుంతో మే 1 నుంచి 23వతేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

నేను క్లీన్ చిట్.. అటు చార్జిషీట్

నామినేషన్‌ను నెల్లూరు అభివృద్ధికి శంకుస్థాపనగా భావిస్తున్నాం

విలేకరులతో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 22 : 'నేను క్లీన్ చిట్.. అటు చార్జిషీట్' అని నెల్లూరు పార్లమెంటు ఎన్‌డీఏ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నామినేషన్ దాఖలు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది నామినేషన్ కార్యక్రమం అనడం కంటే నెల్లూరు జిల్లా అభివృద్ధికి శంకుస్థాపన కార్యక్రమం అని చెప్పవచ్చని అన్నారు. నెల్లూరు జిల్లా ప్రజలకు ఏ హామీలు ఇచ్చానో... వాటిని తప్ప కుండా నెరవేరుస్తానని స్పష్టం చేశారు. తాను లోకల్ అని, కొన్నేళ్లుగా తాను జిల్లాలో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలిచాక కూడా ఈ ప్రాంతం అభివృద్ధికి పని చేస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంటులో జిల్లా ప్రయోజ నాలు కాపాడేందుకు తప్పకుండా కృషి చేస్తానని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వీపీఆర్ పార్టీ మారిన వెంటనే ప్రజల్లో ఒక చైతన్యం వచ్చిందన్నారు. జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలిచేది వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని వివరించారు. వేమిరెడ్డి ముస్లింలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారనే పదానికి తానే ఒక ఉదాహరణ అని గుర్తు చేశారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి చుట్టపు చూపుగా జిల్లాకు వచ్చారని, కానీ వేమిరెడ్డి ఇక్కడ ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఏ విషయంలోనైనా ప్రభాకర్ రెడ్డి నిక్కచ్చిగా ఉంటారని, ఆయన ఆలోచనా విధానం గొప్పగా ఉంటుందన్నారు. ప్రజలందరూ తప్పకుండా సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.261

కలిగిరి, ఏప్రిల్ 22: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు ధర రైతులకు ఆశాజనకంగా ఉంది. రైతులు మొత్తం 386 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 289 బేళ్ల కొనుగోలు చేశారు. నో బిడ్-75, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-8 కారణాలతో 97 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.261, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.232.79గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ఆత్మకూరు ఉదయగిరి


పొలిశెట్టి వైష్ణవి (583)


ఆత్మకూరు సోని (586)


మౌనిక, తరుణ వాయి (579)


ఏఎస్ పేట: రేణు వర్షిత


వింజమూరు: సాయి తన్మయి


కలువాయి ఎం.చంద్రకళ


హెమీమ, సంగం (580)

కార్పొరేట్‌కు దీటుగా 'పది' ఫలితాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 22: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించి ప్రతిభను చాటారు. ఆత్మకూరు మండలంలోని 13ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రాయగా 434మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో షేక్ నజీర్‌బాష తెలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాల పి.భవానీ (587), పేరారెడ్డిపల్లి పాఠశాల వేదసరస్వతి (568), ఎల్ఆర్‌పల్లి పాఠ శాల నాని 573 సాధించారు. కరటంపాడు పాఠశాల ఎం.ద్రాక్షాయణి 561 మార్కులు సాధించింది.

సీతారామపురం: (567)మార్కులతో శ్రవంతి (564) అఖిల్ (560), బసినేనిపల్లి కే.కీర్తన (556), సీతారామపురం పాఠశాల షేక్ మహమ్మద్ ఖలీల్ (551), అయ్యవారిపల్లి కస్తూర్బా బాలికల పాఠశాల కౌశిక 538, ఏపీ మోడల్ స్కూల్ శృతి 517, గూరువారిపల్లి పాఠశాల స్నేహలత 463 తెచ్చారు.

సంగం: స్థానిక ఉన్నత పాఠశాల పి.వైష్ణవి (583), స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని హెమీమ (580), తరుణవాయి జెడ్పీహెచ్ఎస్ మౌనిక (579) మార్కులు తెచ్చారు.

అనంతసాగరం: రేవూరు ఉన్నత పాఠశాల పి.దివ్య (576)గా నిలిచారు. విద్యార్థిని వార్డెన్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులను అభినందించారు. అదే పాఠశాల జీవన్, చందు 565 మార్కులు తెచ్చారు.

ఏఎస్ పేట: 245మంది ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాల జి.రేణు (589) సాధించారు.

వరికుంటపాడు: 8ఉన్నత పాఠశాలల నుంచి 174మంది ఉత్తీర్ణత చెందారు. తిమ్మారెడ్డిపల్లి పాఠశాల మధుసూదన్ (586), శ్రీతేజ(568), వరికుంటపాడు హారిక (566) మార్కులు తెచ్చారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల షేక్‌సానియా (583), ఎస్.జ్యోస్త్నిక (579), ఎస్.శ్రావ్య (576) మార్కులు సాధించారు.

దుత్తలూరు: స్థానిక ఆదర్శ పాఠశాల తేజస్విని (571), వైష్ణవి 567, నాగజ్యోతి (565) సాధించారు.

కలువాయి: చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్‌కే.తాసిఫా (572), ఎం.చంద్రకళ 539 మార్కులు తెచ్చారు. చంద్రకళను వసతిగృహ సంక్షేమాధికారి సీహెచ్. వెంకటరమణమ్మ అభినందించారు.

మర్రిపాడు: 326మంది ఉత్తీర్ణత సాధించారు. నందవరం మోడల్ స్కూల్ మనోజ్ (577), పోలిరెడ్డిపల్లి పాఠశాల చందన (566), నందవరం పాఠశాల తస్లీమా కౌసర్ (564) తెచ్చారు.

వింజమూరు: గుండెమడగల ఉన్నత పాఠశాల కె.సాయితన్మయి (587) మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, డివిజన్ రెండో ర్యాంకును సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

జలదంకి: జలదంకి హైస్కూల్ పీవీఎల్ తేజశ్రీ (590), బ్రాహ్మణక్రాక హైస్కూల్ కె.ఉత్పాలప్రియ (584) మార్కులు సాధించారు.

గుడ్లూరు : బసిరెడ్డిపాలెం, గుడ్లూరు, చినలాటవరపి, చేవూరు, మొగుళ్లూరు కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు.

అల్లూరు: జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.

వలేటివారిపాలెం: 98.95శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు. చుండి మోడల్‌స్కూల్, జమీన్‌ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, పోకూరు హైస్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణులయ్యారు.

కావలి రూరల్ : తుమ్మలపెంట గురుకుల పాఠశాల విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత తెచ్చారు.

కొండాపురం: మండలంలో 85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు, ఒక ఆదర్శపాఠశాల, ఒక కేజీబీవీ, ప్రైవేటు పాఠశాలతో కలిపి 308మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

కలిగిరి: కేజీబీవీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయ బృందానికి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కేతు సుప్రియ అభినందన తెలిపారు.

లింగసముద్రం: తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ హప్తార్ అభినందించారు. మొగిలిచెర్ల హైస్కూల్ విద్యార్థులు 27మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం సూర్యప్రకాశరావు చెప్పారు. లింగసముద్రం జడ్పీ హైస్కూల్‌లో 89మంది పాసయ్యారని హెచ్ఎం మాధవరావు చెప్పారు.

ఉలవపాడు : వీరేపల్లి మోడల్ స్కూల్, రామాయపట్నం జడ్పీ హైస్కూల్, భీమవరం హైస్కూల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవోలు ప్రసాదరావు, రమణయ్య అభినందనలు తెలిపారు.

బిట్రగుంట : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుంచి 376 మంది ఉతీర్ణులై 81 శాతం సాధించినట్లు అధికారులు తెలిపారు.


ధనుష్కను అభినందిస్తున్న నలంద చైర్మన్ ఎండీ మజహర్

నలంద ధనుష్కకు 596 మార్కులు

కావలి టౌన్: నలందా పాఠశాల విద్యార్థిని గుణపాటి ధనుష్క 596మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. విద్యాసంస్థల చైర్మన్ ఎండీ మజహర్, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో శీనానాయక్, డైరెక్టర్లు వసీం, ఫహీం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయలు ధనుష్కను అభినందించారు.

● ఆర్ఆర్ పాఠశాల కృష్ణతేజ 588, అక్షయ్ 576 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరావులు విద్యార్థులను అభినందించారు.

● కాకతీయ పాఠశాల ఎస్‌కె రేష్మ 571, భావన 570మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారు. వారిని కరస్పాండెంట్ జాకబ్, డైరెక్టర్ మంజుల, ప్రిన్సిపాల్ ఫైరోజ్ అభినందించారు.

● శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సీహెచ్ చాతుర్య 596 మార్కులు సాధించింది. కాగా కావలి డివిజన్‌లోని ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సుధాకర్ తెలిపారు. దీంతో పట్టణంలోని తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వార్డెనను అభినందించారు.

మద్యం అక్రమ నిల్వలు, విక్రయాలపై చర్యలు తీసుకోండి

● సెబ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్


కందుకూరు సెబ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీ దయాసాగర్

కందుకూరు, ఏప్రిల్ 22: మద్యం అక్రమ నిల్వలు, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుని బాధ్యులను అరెస్టు చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అసిస్టెంట్ కమిషనర్ పీ.దయాసాగర్ ఆదేశించారు. సోమవారం ఆయన కందుకూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో మద్యం అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై తీసుకున్న చర్యలు, కేసుల నమోదును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా పెద్దఎత్తున మద్యం అక్రమ నిల్వలు చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇతర రాష్ట్రాల మద్యం తరలించకుండా నిఘా ఉంచి అడ్డుకోవాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఇన్స్‌పెక్టర్ డీ.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో మద్యం.. అసలు సూత్రధారులు ఎవరు?

● అడ్మిన్‌పై చర్యలకు అధికారుల సన్నద్ధం

కావలి, ఏప్రిల్ 22 : బుడంగుంట సచివా యంలో ఆదివారం పట్టు బడిన మద్యం, రేషన్ బియ్యంపై విచారించి బాధ్యులపై చర్యలు చేప ట్టాలని కోరుతూ అధికారులు సోమవారం పోలీ స్‌లకు ఫిర్యాదు చేశారు. ఎవరు తప్పు చేసినా అడ్మినేదే బాధ్యతని, ఆయ నపై చర్యలు తీసుకునేందు కు రెవెన్యూ, పోలీస్ పెద్ద లు భావిస్తుండటంతో దానిని తప్పు పట్టినట్లు తెలుస్తోంది. ఎవరో ఒకరిని బాధ్యులుగా చూపించి చర్యలు తీసుకుంటే ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నుంచి బయట పడవచ్చని రెవెన్యూ, పోలీస్ పెద్దలు భావిస్తున్నారు. అయితే, సచివాలయంలో మద్యం సీసాలు, రేషన్ బియ్యం ఎలా వచ్చాయి? వా టిని ఎవరు తీసుకొచ్చారో విచారించి బాధ్యులపైనే చర్యలు తీసుకుంటే మరోసారి ఇలాంటి తప్పు జరగకుండా ఉంటుందని విచారణ అనంతరమే చర్యలు చేటాపట్టాలం టున్నారు. సచివాలయంలో మద్యం ఉంచడం వెనుక సచివాలయ సిబ్బంది సహకరించారా!? లేదా వలంటీర్లు సహకరించారా!? అనేది అర్థం కావటంలేదు. మొత్తానికి అస లు నేరస్థులను తప్పించి ఎవరిపైనో ఒకరిపై నెపం మోపాలనే ఉన్నతాధికారుల ఆలోచన వెనుక అధికార నేతల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమాలకు అడ్డాగా సచివాలయం

● మద్యం నిల్వలపై చర్యలేవి : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కావలి, ఏప్రిల్ 22: ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయంలో మద్యం, రేషన్ బియ్యం నిల్వ చేస్తూ అక్రమాలకు అడ్డాగా మార్చారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నేతలు చవల రామకృష్ణ, దేవరకొండ శ్రీనివాసులు, గుంజి ప్రసన్న కుమార్, వీ వెంకటకిరణ్‌లు విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు వైసీపీ నాయకులు చేస్తూ బురద మాత్రం ప్రతిపక్షాలపై చల్లుతున్నారన్నారు. బుడంగుంట సచివాలయంలో మద్యం నిల్వలు ఉన్నాయని తాము సీ విజల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు తనిఖీలు చేసి 43 మద్యం సీసాలతో పాటు అక్కడ నిల్వ ఉన్న 9 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారన్నారు. వైసీపీ నాయకుడిగా ఉన్న రేషన్ డీలర్ వెంకటేశ్వర్‌రెడ్డికి ఆ సచివాలయం అడ్డాగా మారిందన్నారు. సచివాలయ సిబ్బంది దగ్గర ఉండాల్సిన తాళాలు ఆయన వద్దకు ఎలా వచ్చాయన్నారు. మద్యం, రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని 48 గంటలు దాటినా ఇప్పటి వరకు అధికారులు అందుకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మద్యంపై నేర చరిత్ర ఎవరికి ఉందో అందరికి తెలుసని, ఈ మద్యం నిల్వల వెనుక ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హస్తముందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఆలా శ్రీనివాసులు, కే రామక్రిష్ణ, సాదు శ్రీధర్, ఆంద్ర శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చేజర్ల, ఏప్రిల్ 22: పర్యావరణాన్ని పరిరక్షణ అందరి బాధ్యత అని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహాసంఘం నాయకులు వెంకటేశ్వర యూనివర్సిటీ రసాయన శాస్త్ర ఆచార్యులు వైవీ రామిరెడ్డి తెలిపారు. సోమవారం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎలియా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై పాటించాల్సిన నియమాలు గురించి వివరించారు. పాటించకపోతే జరిగే అనర్థాలను వివరించారు. ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభిషేకం

సంగం, ఏప్రిల్ 22: వంగల్లు సీతా సమేత కోదండరాముడి పట్టాభిషేకం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఉంచి పూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

స్నాప్ లోకల్ యాప్ ప్రారంభం

వింజమూరు, ఏప్రిల్ 22: మండకేంద్రానికి చెందిన ఫౌండర్స్ రేవనూరి వెంకట కరుణాకర్ రెడ్డి, గణపం ప్రతాప్‌రెడ్డిలు గ్రామ యువతతో కలిసి నూతనంగా తయారు చేసిన స్నాప్ లోకల్ యాప్‌ను సోమవారం చెన్నకేశవస్వామి దేవస్థానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జాబ్ అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశంలో ఎక్కడ నుంచి అయినా లోకేషన్ పరిశీలన చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రేవునూరి రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, స్నేహితులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆనం నామినేషన్

● వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
● ఆత్మకూరు వీధులన్నీ పూల వర్షంతో పసుపు మయం


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా బయలుదేరిన ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 22: ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నామినేషన్‌కు ఆరు మండలాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలోని అన్ని ప్రధానరహదారులన్నీ పూలలతో తడిసిముద్దయ్యాయి. సుమారు 30వేల పైచిలుకు జనాభా హాజరైనట్లు రాజకీయ విశ్లేషకులు తెలియజేస్తున్నారు.

జన ప్రభంజనంతో భారీ ర్యాలీ

ముందుగా స్థానిక సత్రం సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తాళ్లూరి గిరినాయుడు, ఆనం రంగమయూరిరెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, పలువురు టీడీపీ నేతలు భారీ ర్యాలీతో నామినేషన్‌కు బయలుదేరారు. ఈ ర్యాలీ పురవీధుల గుండా వెళుతుండగా అడుగడుగునా ఆనంకు పూలవర్షం కురిపిస్తూ జన ప్రభంజన హోరు కొనసాగింది. హిందూ సాంప్రదాయం, కాలనిర్ణయం ప్రకారం ఆనం రామనారాయణరెడ్డి సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఆనం స్వగ్రాం నెల్లూరులోని ఏసీ సెంటర్‌లోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేకపూజచేసి నామినేషన్‌కు బయలుదేరారు. అక్కడ నుంచి ఆత్మకూరు సమీపంలోని అకమ్మమాను వద్ద, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజ చేశారు. తదనంతరం నామినేషన్‌కు ర్యాలీగా బయలుదేరి వెళ్లి నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుట్టం బ్రహ్మానందరెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి అంజనేయరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణ్మ ఉన్నారు.


విజయకేతనం చూపుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరులో అత్యధిక మెజార్టీతో విజయం : ఆనం

నియోజకవర్గ ప్రజలు, టీడీపీ, బిజెపి, జనసేన పార్టీల నేతల ఆశీర్వదబలంతో ఆత్మకూరులో తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయవని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నామినేషన్ వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్‌కు తరలివచ్చిన అశేష ప్రజానికానికి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆత్మబంధువులు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కొనసాగాలన్నా కూటమి అభ్యర్థులు విజయం సాధించటం చారిత్రక అవసరం అన్నారు. నియెజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే లక్ష్యం తెలుగుదేశం పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

ఏఎస్ పేట: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో వేసే నామినేషన్‌కు మండలం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, నంది వివేకనందరెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహారెడ్డి, షేక్ జిలాని బాషా, షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో వేలాదిగా ప్రజలు తరలివెళ్లారు. ఆత్మకూరు- ఏఎస్ పేట రహదారి మొత్తం పసుపు జెండాలతో కళాకళాలాడింది. మహిళలు పాల్గొన్నారు.

చేజర్ల: ఆత్మకూరులో జరిగిన ఆనం నారాయణరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. నవకృష్ణచౌదరి, రావి లక్ష్మనరసారెడ్డి, రావి పెంచలరెడ్డి, వీరరాఘవరెడ్డి, అన్నలూరు శ్రీనివాసునాయుడు, కొమ్మి సిద్దులనాయుడు, రమేష్‌నాయుడు, పెంచలనాయుడు, చీర్ల వెంకటేశ్వర్లు, గోనుగుంట రాంబాబు, కొమ్మి పార్థసారది, హజరత్, గుత్తా కిష్టయ్య, షేక్ సిరాజుద్దీన్, అచ్చాల నారాయణరెడ్డి, ఎన్‌వి కంద్రిక నారాయణ ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22: కృష్ణంపల్లి సచివాలయ పరిధిలో విధు లు నిర్వహిస్తున్న ఇద్దరు గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మకు వారు రాజీనామా పత్రాలు అందజే యనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22: రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తేనే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ అభ్యర్థి సోము అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వామపక్ష పార్టీలు కాంగ్రెస్ పార్టీని బలపరుస్తుండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కాకార్ల నామినేషన్


● వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
● ర్యాలీగా బయలుదేరి ఉదయగిరికి..


ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 22: నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ నామినేషన్ దాఖలు సోమవారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఆయన వింజమూరు టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి సమీపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి వాహనాల ర్యాలీతో ఉదయగిరికి చేరుకొన్నారు. స్థానిక ఏబీఎం సభా ప్రాంగణం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పంచాయతీ బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సురేష్ వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు నాయకులు గజమాలలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఎన్‌డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా కాకర్ల సురేష్ ఆర్వో రాజారమేష్‌ప్రేమ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి తనకు మద్దతు తెలపడం సంతోషకరం అన్నారు. జనసందోహాన్ని చూసి ఈ ఎన్నికల్లో 50వేల మెజార్టీతో విజయం సాధించి ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఉదయగిరిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తానన్నారు. ఓ ప్రణాళిక రూపొందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు బీడు భూములను సాగులోకి తీసుకొస్తామన్నారు. ఇంటింటికి శుద్ధిజలం అందజేసి ఫ్లోరైడ్ సమస్యను తీరుస్తామన్నారు. ఉదయగిరిని డెల్టాగా మార్చడమే తన ధ్యేయమన్నారు. మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు చేపట్టడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికు సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయ రామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చెంచలబాబు యాదవ్, శాంతకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు వేనాటి సతీష్‌రెడ్డి, బీజేపీ, జనసేన ఇన్‌చార్జిలు రంగరావు, వెంకటేశ్వర్లు, నాయకులు కాకర్ల సునీల్, కాకర్ల వెంకట్, కాకర్ల ప్రవీణ, కాకర్ల సురేష్, బయ్యన్న, రియాజ్ పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న కాకర్ల

వింజమూరు: నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం బొమ్మరాజుచెరువు తెలుగుదేశం కార్యా లయం నుంచి భారీ ర్యాలీతో బయలుదేరారు. అంతకుముందు ఆయన ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి భారీ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈయన వెంట కాకర్ల సోదరుడు కాకర్ల సునీల్ కుటుంబసభ్యులు ఉన్నారు. సురేష్‌కు ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. జై టీడీపీ.. జై చంద్రబాబు నాయుడు.. జై లోకేష్‌బాబు.. జై కాకర్ల సురేష్ అంటూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ ప్రచార రథంపై ప్రజలకి అభివాదం చేస్తూ వెళారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ మీ అమూల్యమైన ఓటును.. సైకిల్ గుర్తుపై ఓటేసి.. నన్ను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

సీతారామపురం: ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్ నామినేషన్‌కు సోమవారం పార్టీ మండల కోఆర్డినేటర్ చింతల శ్రీను, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు 50కాన్వాయిలతో నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు.


ప్రత్యేక పూజల అనంతరం నామినేషన్ పత్రాలను అందుకుంటున్న కాకర్ల దంపతులు


సీతారామపురం: నామినేషన్ కార్యక్రమానికి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

బ్రాహ్మణక్రాకలో వంటేరు పర్యటన


బ్రాహ్మణక్రాకలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, ఏప్రిల్ 22: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తన స్వగ్రామం బ్రాహ్మణక్రాకలో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక శివాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ప్రారంభించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీకి ఓట్లు వేస్తే రాష్ట్రమే కాక మనగ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ముఖ్యంగా యు వత చంద్రబాబును సీఎం చేసుకుంటే ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపా రు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ప్రచారంలో సర్పంచు ఇండ్ల సుధాకర్, కాకర్ల మామ కడియాల వెంకటేశ్వర్లు, నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు అక్కల శ్రీనివాసులరెడ్డి, దగుమాటి శ్రీనివాసులరెడ్డి, వేలమూరి వెంకటేశ్వరరె డ్డి, దేవరపల్లి వెంకటరమణారెడ్డి, జిలుమూడి వినయ్‌రెడ్డి, వంటేరు నందు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం


పెన్నబద్వేలిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కలువాయి, ఏప్రిల్ 22: తెలుగుదేశం అధికా రంలోకి రాగానే వృద్ధాప్య, వితంతు పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4వేలకు పెంచి ఇంటికి తీసుకొచ్చి ఇస్తారని టీడీపీ మండలాధ్యక్షులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘు రామిరెడ్డి తెలిపారు. సోమవారం వారు పెన్నబద్వేలులో జనసేన, బీజేపీ నాయ కులు కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిం చారు. కార్యక్రమంలో పీర్ల సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, కిషోర్‌రెడ్డి, వింజం మల్లికార్జున, బాబురావు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత

సంగం: మండలకేంద్రానికి చెందిన తిరిపాలు తిరిపాలు సోమవారం సాయంత్రం స్థానిక బస్టాండ్‌లో సంచిలో 10సీసాలు పెట్టుకుని సైకిల్‌పై తీసుకెళ్తుతుండగా పోలీసులు తనిఖీలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు బస్టాండ్ సెంటర్ల సమీ పంలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నా రన్న సమాచారం అందుకున్న ఎస్ తిరుపత య్య దాడులు నిర్వహించి 18 మద్యం సీసా లను స్వాధీనం చేశారు. వాటిని తరలిస్తున్న తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన షేక్ కాలేషా, వరికుంటపాడు ఎస్సీ కాలనీకి చెందిన నందిపోగు ఆదినారాయణలను అదుపులోకి తీసుకొన్నారు.

సోమశిలలో 8.419 టీఎంసీలు

అనంతసాగరం, ఏప్రిల్ 22: సోమశిల పూర్తిస్థాయి నీటి మట్టం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి ప్రాజెక్టులో 8.419 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6942
వెండి కిలో ధర	రూ. 84,500
వెండి ఒక గ్రాము	రూ. 86.50

కోవూరును రోల్‌మోడల్ నియోజకవర్గంగా చేస్తా

● బుచ్చి ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 22: అవినీతికి, వివాదాలకు తావులేకుండా కోవూరును రోల్‌మోడల్ నియోజకవర్గంగా చేసి చూపిస్తానని ఎన్డీఏ ఉమ్మడి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని కట్టుబడిపాళెం, రామచంద్రాపురం, శ్రీ పురంధరపురం గ్రామాలలో గ్రామ సర్పంచ్ సోము నిర్మల, నమిడిరెడ్డి కృష్ణారెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సూళ్ళూరుపేట ముంపు వాసులకు పురంధరపురంలో భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు. బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ పథకాలు వివరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక కూడా ఉచితంగా ఇస్తామన్నారు. అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సీఎంగా, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ప్రశాంతిరెడ్డి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాణెం వెంకురెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటరమణమ్మ, ఎంపీ శేషయ్య, బత్తల హరి కృష్ణ, సూరా శ్రీనివాసులురెడ్డి, రామానాయుడు పాల్గొన్నారు.



పాటూరులో అభివాదం చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పాటూరులో ప్రశాంతిరెడ్డి ప్రచారం

కోవూరు : టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాటూరు గ్రామంలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో అధికార పక్షం పునాదులు కదులుతున్నాయని, ఓటమి భయంతో వైసీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన తరువాత నియోజకవర్గంలో జరిగిన అరాచకాలపై దృష్టి పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ కమిటీ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, నాటకరాని వెంకట్, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమిరెడ్డి దంపతులను విమర్శంచే అర్హత ప్రసన్నకు లేదు

కొడవలూరు : ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వేమిరెడ్డి దంపతులను విమర్శించే అర్హత ప్రసన్నకు లేదని ప్రశాంతిరెడ్డి కోడలు ఐషితరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొడవలూరు పంచాయతీ పరిధిలో మూటకట్ల సంఘంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఐషితరెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి టీడీపీ గెలిస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్యాయాలు ,అక్రమాలు తప్ప చేసిన అభివృద్ధి ఎక్కడ కనిపించడంలేదన్నారు. ఐదేళ్ల వైసీపీ అరాచకపు పాలనకు చమరగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లంరెడ్డి సురేష్ రెడ్డి, కోవూరు జానకీ, పంది శ్రీనివాసులు, నక్కా రవణయ్య, ఓట్టూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యం

సార్వత్రిక ఎన్నికలలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు కదురు కృష్ణ అన్నారు. మండలంలో పద్మనాభసత్రం గ్రామంలో కదురు క్రిష్ణ ఆధ్వర్యంలో సోమవారం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. వేమిరెడ్డి దంపతుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. వేమిరెడ్డి దంపతులతోనే పేదల అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

● సోమిరెడ్డి సమక్షంలో 85 కుటుంబాలు టీడీపీలో చేరిక

వెంకటాచలం, ఏప్రిల్ 22: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి, అరాచకాలతో సర్వేపల్లి ప్రజలు విసిగిపోయారని ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించేందుకు సిద్ధమయ్యారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో సోమవారం మండలంలోని పూడిపర్తి, రామదాసుకండ్రిగ, సర్వేపల్లి, ఇస్కపాళెం గ్రామాల నుండి 85 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీలోగా వైసీపీ పూర్తిగా ఖాళీ అవ్వడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్, ఆయా గ్రామాల స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

కార్యక్రమంలో మండల అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, బాబునాయుడు, సత్యనారాయణ, చంద్రశేఖర్, భాస్కర్, రామయ్య, రవీంద్ర, లక్ష్మయ్య, ఏ.గోపాలయ్య, వేణుగోపాల్, అడపాల సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాకాణి కల్తీ మద్యంతో జాగ్రత్త..!

ముత్తుకూరు: చీప్ లిక్కర్‌తో ప్రజల ప్రాణాలు తీసేందుకు మద్యం నిల్వలతో కాకాణి సిద్ధంగా ఉన్నాడని.. ప్రజలు జాగ్రత్తగా వుండాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మల్లూరుకు చెందిన 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి చీప్ లిక్కర్ మూటలతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకునేందుకు చూస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ఈపూరు మునిరెడ్డి, పాల్గొన్నారు.

పొదలకూరులో ఈసారి మెజారిటీ తథ్యం

పొదలకూరు: గత ఎన్నికల్లో పొదలకూరు మండలంలో తనకు నాలుగైదు వేలు మైనస్ వచ్చేదని.. ఈసారి నాలుగైదు వేలు మెజారిటీ వస్తుందని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొనగలూరు, రామాపురం, దుగ్గుంట, మహమ్మదాపురం గ్రామాలలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొనగలూరులో 15 కుటుంబాలు, దుగ్గుంటలో 18 కుటుంబాలు వైసీపీ, కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరాయి. మహమ్మదాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు పల్లిబోయిన వెంకటశేషయ్య, గుడి వెంకయ్యలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని మంత్రి కండువా కప్పి ఆహ్వానించారు.

సోమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

పట్టణంలోని కాకాణి రమణారెడ్డి కాలనీ, శ్రీనివాస లేఅవుట్‌లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని, సూపర్ సిక్స్ పథకాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాపూరు మాజీ ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నం నాయుడు కుటుంబీకులు నువ్వుల కవిత, టీడీపీ పట్టణ నాయకుడు రాపూరు బాబు, ఛత్రపతి కుటుంబ సభ్యులు, చింతగింజల విజయ్, దర్శి విజయ్‌బాబు, మండల మహిళా అధ్యక్షులు ఆదాల సుగుణమ్మ, మద్దిరిళ్ల వెంకట సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం నుంచి 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వేదాయపాలెం సోమిరెడ్డి నివాసంలో వారికి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన గంగాధర్, బైనబోయిన శ్రీనివాసులు, తానే మస్తాన్, తెలిమేటి ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

ముత్తుకూరు, ఏప్రిల్ 22: పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ఆదానీ కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు, కార్మికులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం ప్రపంచ ఎర్త్‌డే సందర్భంగా ఈహెచ్ఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పోర్టులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పోర్టులో పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకుండా భూమిలో కలిసి పోయే వాటిని వినియోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, భూమిని సురక్షితంగా ఉంచుదామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న పోర్టు ఉద్యోగులు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు తెలిపారు. అదాని కృష్ణపట్నం పోర్టులో సోమవారం సాయంత్రం అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండడం వలన ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు .మహిళలు గృహాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది పలు విన్యాసాలను ప్రదర్శించింది. అగ్ని ప్రమాదం నివారణ ఎలా ఎదుర్కోవాలి వంటి వాటిని ప్రదర్శన ద్వారా ఉద్యోగులు కార్మికులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉమేష్ అభయంకర్, సీఓఓ రాజన్‌బాబు, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, భాస్కరన్, ఫైర్ సేఫ్టీ హెడ్ జి రాజేంద్రనాద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22: ప్రమాదవశాత్తు వేడి కూర ఒంటిపై పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... తోటపల్లి గూడూరుకు చెందిన అన్నం శంకరయ్య(58) కుటుంబ కలహాల నేపథ్యంలో 2018 నుంచి గోమతి నగర్‌లోని సర్వేపల్లి కాలువ కట్ట వద్ద ఇంటిని అద్దెకు తీసుకుని ఒంటరిగా నివసిస్తున్నాడు. మార్బుల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతను ఈ నెల 7వ తేది తన ఇంట్లోనే ఎలక్ట్రికల్ కుక్కర్‌లో వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు కూర గిన్నె చేయి జారి ఒంటి పైన పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ నెల 17వ తేదీ అతని కుమారుడు వంశీకృష్ణ నెల్లూరుకు చేరుకుని జీజీహెచ్ నుంచి తన తండ్రిని మెరుగైన చికిత్స నిమత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోక పోవడంతో రెండు రోజుల క్రితం తిరిగి జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ శంకరయ్య సోమవారం మృతి చెందాడు. వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22: నగరంలోని జాఫర్ సాహెబ్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు రంగనాయకులపేటలోని రైల్వే రోడ్డు ప్రాంతంలో షేక్ జమీర్(67), కుర్షీద్ దంపతులు నివసిస్తున్నారు. వారికి నలుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. అంతరికీ వివాహాలు అయ్యాయి. కుమారుడు మున్నా తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. జమీర్ సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, కుమారుడు మున్నా పూల డెకొరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనారోగ్య సమస్యలో, మరే ఇతర కారణాలో స్పష్టంగా తెలియదుగానీ సోమవారం జమీర్ సమీపంలో ఉన్న జాఫర్ సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో కుమారుడు మున్నా సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరు సర్వేపల్లి

'పది' విద్యార్థులకు అభినందనలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 22: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు పరక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. బుచ్చిలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల, డీఎల్ఎన్ఆర్ హైస్కూలు, రేబాలలో పీఆర్ఎం జడ్పీ హైస్కూలు, మినగల్లులోని జడ్పీహైస్కూలు, పెనుబల్లి జడ్పీ హైస్కూలు, దామరమడుగు హైస్కూలులో ప్రతిభచాటిన విద్యార్థినీ. విద్యార్థులను ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

'వివేకానంద' ఘనత



దేవరపల్లి యషిత

వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్లో దేవరపల్లి యషిత 592 మార్కులు సాధించి ప్రతిభ చాటిందని స్కూలు కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూలు కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

●**మనుబోలు:** పదోతరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మండలంలో ప్రథమ శ్రేణిలో మడమనూరుకు చెందిన కటికాల వర్షిక (588)మార్కులతో, మనుబోలు బాలుర పాఠశాల విద్యార్థిని చింతలపూడి నిహారిక(574)మార్కులతో ద్వితీయశ్రేణిలో, 553 మార్కులతో మడమనూరు విద్యార్థిని టి సాయిసాత్విక నిలిచింది. మడమనూరు పాఠశాల హెచ్ఎం వివి రాదాకృష్ణ, ఇతర ఉపాధ్యాయులు పాఠశాలకు చెందిన వర్షిక మండల టాపర్‌గా నిలవడంతో విద్యార్థిని అభినందించారు.

●**ముత్తుకూరు:** పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ముత్తుకూరు మండలం 86.7శాతం ఉత్తీర్ణత సాధించింది. ముత్తుకూరు జడ్పీ విద్యార్థిని లాస్యలహరి 581 మార్కులతో టాపర్‌గా నిలిచింది. బాలికల గురుకుల పాఠశాల 97.4శాతం, ముసునూరువారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 90.4శాతం ఫలితాలు సాధించారు.

●**వెంకటాచలం:** మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాల్లో సోమవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 83.01 శాతం ఉత్తీర్ణులయ్యారు. గొలగమూడిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బీసీ బాలికల పాఠశాల విద్యార్థిని ఎస్ సుస్మిత 584 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో పూడిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నిక్కుదల సుదీష్‌కి 571 మార్కులు, తృతీయ స్థానంలో పూడిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని జానా హరిత 570 మార్కులు సాధించింది. గొలగమూడిలో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బీసీ బాలికల పాఠశాల, ఏపీ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

●**తోటపల్లిగూడూరు:** మండలంలోని ఈదూరు, తోటపల్లిగూడూరు, చెన్నపల్లిపాలెం, చిన్నచెరుకూరు, వరిగొండ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కోడూరు మొత్తం 83శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి సన్నపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కాగా, కోడూరు గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాలు అనూహ్య 568, నాగమణి 559 మార్కులతో, చిన్నచెరుకూరు హైస్కూల్‌కు చెందిన చరణ్ 543 మార్కులతో తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

●**పొదలకూరు:** మండలంలోని ఇరువూరు జడ్పీ హైస్కూల్‌లో 17 మందికి 17 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, మొగళ్లూరు జడ్పీ హైస్కూల్‌లో 31 మందికిగాను 21 మంది ఉత్తీర్ణత సాధించి 71శాతం ఉత్తీర్ణత సాధించారు. తోడేరు జడ్పీ హైస్కూల్‌లో 579 మార్కులు బి.సుప్రత అనే విద్యార్థి మండలంలోని జడ్పీ హైస్కూల్‌లో మొదటి స్థానంలో నిలిచింది.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 22 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సోమవారం నుండి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 425 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 505 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఉదయం జరిగిన పరీక్షల్లో నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జేబీ కళాశాలలో ఒకరు, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జేబీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 22: మండలంలోని బుచ్చి, జొన్నవాడ మార్గంలో సాల్మానుపురం సమీపంలోని ఓ లేఔట్ వద్ద ముందు వెళ్తున్న ఓ బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొన్న సంఘటన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో పంచేడు గ్రామానికి చెందిన దళారి ఎన్ కృష్ణయ్య తీవ్ర గాయాలతో ప్రాణాపాయస్థితిలో వుండగా వెనుకవున్న మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. వీరిని 108లో నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణాల తనిఖీ

మనుబోలు, ఏప్రిల్ 22: మద్యం దుకాణాల్లో సిబ్బంది ఇకనుంచి ఒక వ్యక్తికి ఒక సీసా మాత్రమే ఇవ్వాలని ఎక్సైజ్ ఎస్ఐ గురవేశ్వరి ఆదేశించారు. సోమవారం ఆమె మండలంలోని 5 మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో అమ్మకాల వివరాలు, దుకాణాల్లో ఉన్న స్టాకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఒక వ్యక్తికి ఒక సీసా మాత్రమే ఇవ్వాలని సూచించారని, ఇచ్చిన టార్గెట్ల ప్రకారమే సిబ్బంది అమ్మకాలు చేయాలన్నారు. ఆమె వెంట పీసీ వీరాస్వామి ఉన్నారు.

విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం తగదు : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 22 : జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చేపట్టే పనులను అలస్యం చేయడం ఏమిటని అధికారులను విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ప్రశ్నించారు. ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని ఈఈలు, డీఈలు, ఏఈలతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ పనులకు సంబంధించి మెటీరియల్ తీసుకున్నప్పటికి పనులు పూర్తి చేయకుండా చాలా చోట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్ పనులు నెలాఖరులోపు పూర్తి చేయకపోతే సంబంధిత ఏఈల జీతాల నుంచి జరిమానా సొమ్ము రికవరీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సబ్‌స్టేషన్ల నిర్వహణ మరింత పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయండి

నెల్లూరు (హరనాథపురం) : చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లా సరిహద్దులు, ఇతర మార్గాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ద్విచక్ర వాహనాలను కూడా తనిఖీ చేయాలని సూచించారు. రాత్రివేళలో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టి అక్రమంగా రవాణా అవుతున్న వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

● చెక్‌పోస్టుల్లో ఎస్పీ తనిఖీలు

నెల్లూరు(క్రైం) : నగర శివార్లలోని పలు చెక్‌పోస్టులను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీ విజల్ ద్వారా ఫిర్యాదు చేసిన, కోడ్ ఉల్లంఘనకు పాల్పడినా తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు.

వైభవంగా కోదండరాముడి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 22: పెద్దూరులోని సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తలంబ్రాలు పంపిణీ చేశారు. స్వామి, అమ్మవారి తరపున పెళ్లిపెద్దలుగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళి కృష్ణారెడ్డి దంపతులు, ఆలయ పండితులు వ్యవహరించారు. రాత్రి స్వామివారు గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి రథోత్సవం, సాయంత్రం పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతుంది.

టెన్త్‌లో ప్రైవేట్ స్కూళ్ల హవా..

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు.



'రత్నం' విద్యార్థులు

● డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని జనరల్ మేనేజర్ రామ్మూరి నాయుడు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభి నందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు నేహా సాయిజాదవ్ 596, టీ సాయి ప్రియాంక, బీ చందన 592, డీ రఘునాథ్ 591, పీ శ్రీరామ్ 590 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, ఏవో తుహీనా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ విద్యార్థులు

● నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకున్నారని డైరెక్టర్ డాక్టర్ పొంగూరు సింధూర తెలిపారు. సోమవారం నగరంలోని నారాయణ విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ విద్యార్థులు ఆకుల వెంకట నాగసాయి మనస్వి 599 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథ మ స్థానంలో నిలిచిందన్నారు. హర్షిత్ 598, కందుకూరి మహిక, రాఫూరి గణేష్, షేక్ షఫియా, షేక్ సమీర, మర్రిన మణికంఠ 597 మార్కులు సాధించా రన్నారు. కార్యక్రమంలో జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఏజీఎంలు డీ రమణారెడ్డి, కే రవివర్మ, చిన్న గురవయ్య, శ్రీనవాసులురెడ్డి, డీన్ డీ నరేంద్రరెడ్డి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

● శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఏజీఎం నర్రా శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ధనలక్ష్మీపురం బ్రాంచ్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థి సీహెచ్ వెంకట సుభాష్ చంద్ర 598 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడన్నారు. ఏసీ నగర్ బ్రాంచ్‌కు చెందిన వీ నందకిషోర్ 592, టీ దత్తసాత్విక్ 590 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారన్నారు. వేదాయపా ళెం బ్రాంచ్‌లో వీ వర్షిణి 591 మార్కులు, బాలాజీనగర్ బ్రాంచ్‌కు చెందిన ఎస్‌కే ఫాతిమా 568 మార్కులు సాధించినట్లు తెలిపారు. కాగా, నగరానికి చెందిన ఆని మోళ్ల లలిత్ సంతోష్‌కి 571 మార్కులు సాధించారు. వనం తోపు వద్ద గల శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో చదివిన ఈ విద్యార్థి తల్లితండ్రులు ఆనిమెళ్ల రాజ, లక్ష్మి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.



లలిత్ సంతోష్

● ఓవెల్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఆర్ వేణు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన ఐ రోషిణి 592, సుమక్షర 590, సాయిసాత్విక్ 588 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో సీఈవో ప్రమీల, ప్రిన్సిపాల్ ఆర్ రామాంజనేయులు నాయుడు, ఇన్‌ఛార్జి ఈశ్వర్, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీ పాఠశాలలో..

● నగరంలోని శ్రీలక్ష్మీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని కరస్పాండెంట్ సీ శీనివాస్ తెలిపారు. పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థిని ఎం చరిష్మా 591 మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందన్నారు.

● పెద్దబజారు శ్రీ మేధా పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల కరస్పాం డెంట్ పీ కొండారెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎస్‌కే జక్రియా అహ్మద్ 589, ఎండీ ఫిరోజ్ 579, ఎస్‌కే అద్నాన్ 577, ఎస్‌కే మహమ్మద్ అలీ 566, ఎండీ హనియాఫాతిమా 564, ఎస్‌కే అల్మాస్ 557, ఎస్‌కే రిజ్వాన్ 554, ఎస్‌డీ .మహ్మద్ మోయిన్ 552 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ పీ లక్ష్మీ పాల్గొన్నారు.



శ్రీ మేధా పాఠశాలలో..



సాధన పాఠశాలలో...

● నగరంలోని సాధన పాఠశాల విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారని కరస్పాం డెంట్ నరసింగరావు తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన పునర్హారెడ్డి 592, మౌనిక 578, నిస్సి కేథరిన్ 572, ఆఫియా తస్నీమ్ 565, ప్రణీత్‌రెడ్డి 555, సాయి నిఖిత 551 మార్కులు సాధించారన్నారు.

● **నెల్లూరు (రూరల్) :** జబుజనెల్లూరులోని శేమ స్కూల్ పది ఫలితాల్లో ప్రభంజనం సృష్టించినట్లు కరస్పాండెంట్ బీ శేషయాదవ్ తెలిపారు. 592 మార్కులతో సనా సమ్రిన్ నిలిచిందని, మొఘల్ తస్నీమ్ 589, శ్రావణి 571 మార్కులతో స్కూల్ ప్రతిష్టతను నిలబెట్టారన్నారు. సౌత్‌మో పూరులోని శ్రీపాద స్కూల్లో 593 మార్కులతో షేక్ మహి మొదట స్థానంలో నిలవగా రెండవ స్థానంలో పముజుల శరణ్య 590 మార్కులతో నిలిచినట్లు కరస్పాండెంట్ రామ సుబ్రమణ్యం తెలిపారు.



సనా సమ్రిన్

కేజీబీవీ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22: ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో కేజీబీవీ విద్యాలయాలకు చెందిన విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలు సాధించారని ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషా రాణి తెలిపారు. ఫలితాల విడుదల సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 12 కేజీబీవీల్లో 437 మంది విద్యార్థినిలు పరీక్షలకు హాజరు కాగా, 401 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో కలిగిరి కేజీబీవీకి చెందిన వి.ప్రణీత 571, జె.విజయలక్ష్మి 568, టి.త్రివేణి 563 మార్కులు సాధించారన్నారు. అలాగే కొండాపురం కేజీ బీవీకి చెందిన సాయిపూర్ణిమ 562, నంది పాడుకు చెందిన పి.మహాలక్ష్మి 562, లింగ సముద్రంకు చెందిన జి.ప్రతిష్ట 556 మార్కులు సాధించారన్నారు. మొత్తంమీద 63 మంది విద్యార్థినిలు 500కు పైగా మార్కులు సాధిం చడం గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన జీసీడీవో టి.మమత, ప్రిన్సిపాల్స్‌తో పాటు విద్యార్థినిలను ప్రత్యేకంగా అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6942
వెండి కిలో ధర	రూ. 84,500
వెండి ఒక గ్రాము	రూ. 86.50

నెల్లూరు రూరల్

రూరల్ టీడీపీలో భారీగా చేరికలు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22 : రూరల్ నియోజకవర్గం టీడీపీలో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరారు. నెల్లూరులోని తన కార్యాలయంలో రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల వైసీపీలో చేరిన 26వ డివిజన్ డ్రైవర్స్‌కాలనీకి చెందిన జాకీర్, ముజహర్, హుస్సేనబాషా, తజముల్, రబ్బానీ, మునీర్ తిరిగి టీడీపీలోకి వచ్చారు. వీరిని కోటంరెడ్డి సోదరులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండలంలోని కొత్తవెల్లంటికి చెందిన సర్పంచ్ తురిమెర్ల లక్ష్మీ, ఆమె భర్త రామారావు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరితోపాటు మరో 100 కుటుంబాలు ఆ పార్టీలో చేరాయి. 30వ డివిజన్ కుమ్మరగుంట, వల్లూరమ్మ కాలనీకి చెందిన చంటయ్య, చంద్ర, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, బద్దెపూడి శ్రీనివాసులును పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం 25వ డివిజన్ బుజబుజ నెల్లూరుకు చెందిన షబ్బీర్, సాజిద్ మిత్రబృందాన్ని కోటంరెడ్డి సోదరులు టీడీపీలోకి ఆహ్వానించారు. 23, 24 డివిజన్లలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్న అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలపై విరుచుకుపడ్డారు.


వెల్లంటి సర్పంచి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోటంరెడ్డి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్‌కి నాలుగు నామినేషన్లు

● వైసీపీ నుంచి ఆదాల దాఖలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తూ నలుగురు నామినేషన్ దాఖలు చేశారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌ఓ మలోలకు పత్రాలు అందజేశారు. వైసీపీ నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రెండు సెట్‌లు నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బొమ్మలట సురేష్, కట్టా శిరీష్ రెండు సెట్‌లు, షేక్ ముజీబ్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం) : ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు టౌన్‌హాల్లో జరుగుతుందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

వేదగిరి క్షేత్రంలో 'జబర్దస్త్' నటులు

నెల్లూరు రూరల్ : వేదగిరి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ అమ్మవార్లను జబర్దస్త్ టీవీ కామెడీ షోకి చెందిన నటులు వినోద్, సుధాకర్ సోమవారం దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆలయ విశిష్టతను వివరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచండి

● రూరల్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా గ్రామాలలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ ఆదేశించారు. సోమవారం నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల వారీగా సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి పరిధిలో నిఘాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఎన్నికలకు ఉపయోగించే అక్రమ మద్యం, నగదు, ప్రలోభ వస్తువులను పూర్తిగా నిలువరించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి, సీఐ మారుతీకృష్ణ పాల్గొన్నారు.



రూరల్ సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ

ముగిసిన అధ్యాపకుల శిక్షణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 : జాతీయ విద్యావిధానంలో భాగంగా నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ ఎంపిక విధానంతో కూడిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానంలో విద్యార్థి డిగ్రీస్థాయిలో ఏదో ఒక సబ్జెక్ట్‌ను ప్రధాన అంశంగా, మరొక సబ్జెక్ట్‌ను మైనర్ సబ్జెక్ట్‌గా ఎంపిక చేసుకుని డిగ్రీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణలో అధ్యాపకులు పొందిన పరిజ్ఞానాన్ని విద్యార్థి సమాజానికి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు అర్థశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్‌రావు, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శుభ, అధ్యాపకులు డాక్టర్ డి.అజయ్‌కుమార్, సమన్వయకర్త డాక్టర్ వి.చెంచురామయ్య, ఎన్‌ఆర్‌సీ సమన్వయ కర్త ఏవి.రమణరావు, పీఆర్‌ఓ జోజి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలే లక్ష్యం!!

నెల్లూరు, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపే దిశగా పొంగూరు నారాయణ అడుగులు వేస్తున్నారు. సొంత జిల్లా రుణం తీర్చుకునేలా యువతకు ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపాలని, అది శాశ్వతంగా నిలిచేలా ఉండాలని నారాయణ కసరత్తు చేస్తున్నారు. నెల్లూరు నగరంలో భారీ స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్న ధీమాతో ఇప్పటి నుంచే దానికి సంబంధించిన పనులను మొదలు పెట్టారు. విద్యారంగంలో నారాయణ విద్యాసంస్థకు ఉన్న అపార అనుభవంతో దేశంలోనే గొప్ప స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్ నెల్లూరు నగరంలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



- నెల్లూరులో భారీ స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్..!
- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు కదులుతున్న నారాయణ
- ఇల్లు లేని నిరుపేద లేకుండా చేసే దిశగా కసరత్తు
- మరో 20వేల పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- వివిధ సామాజికవర్గాల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ హాళ్లు
- అభివృద్ధి మంత్రంతో దూసుకుపోతున్న నారాయణ

దేశంలోనే గొప్పగా ఉండేలా....

నిరుపేద కుటుంబంలో పుట్టి ఉపాధ్యాయుడిగా జీవితం ఆరంభించిన పొంగూరు నారాయణ స్వశక్తితో ఆసియా ఖండంలోనే అతి పెద్ద విద్యా సంస్థను విస్తరించిన విషయం తెలిసిందే. నెల్లూరు నగరంలో అంతే ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపించాలని నిర్ణయించుకున్నారు. నిరుద్యోగ సమస్యతో అల్లాడుతున్న యువతకు ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపడం ద్వారా చిరకాలం గుర్తుండిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఐటీ రంగ అభివృద్ధి ద్వారా తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేసిన చంద్రబాబు నాయుడును స్ఫూర్తిగా తీసుకుని నెల్లూరు నగరంలో భారీ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపే స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ సహాయ సహకారాలతో పూర్తి స్థాయిలో ఉచితంగా యువతకు ఉపాధి రంగాల్లో తర్ఫీదునిచ్చే కేంద్రాన్ని నెల్లూరు నగరంలో స్థాపించనున్నారు. ఈ స్కిల్ సెంటర్ దేశంలోనే గొప్పగా ఉండేలా, పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. విద్యారంగంలో నారాయణ విద్యాసంస్థలకు ఉన్న అపారమైన అనుభవాన్ని రంగరించి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే తన సంస్థకు చెందిన నిపుణులకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ కేంద్రంలో విద్యార్హతను బట్టి అన్ని కేటగిరీల వారికి వివిధ రంగాలకు చెందిన అంశాలపై శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కావాల్సిన ప్రత్యేక శిక్షణ లేని కారణంగా డిగ్రీ పట్టాలు పుచ్చుకున్న అత్యధికుల చదువుకు సార్థకత లేకపోతున్న విషయం తెలిసిందే. నెల్లూరు యువతకు ఆ పరిస్థితి లేకుండా చేయడమే ఈ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ముఖ్య ఉద్దేశం. నారాయణ ఆలోచనల నుంచి పురుడుపోసుకొంటున్న ఈ సెంటర్‌పై యువతలో విశ్వాసం వ్యక్తం అవుతోంది. విద్యావ్యవస్థలో నారాయణ సంస్థలకు ఉన్న స్థానం ఏమిటో, ప్రత్యేకతలు ఏమిటో అందరికీ తెలిసిందే. నారాయణ ఏదైనా పని మొదలు పెడితే ఎలా ఉంటుందో నగర ప్రజలకు తెలిసిందే. పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో నారాయణ మంత్రి హోదాలో నెల్లూరులో మున్సిపల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నగరంలోని పేద విద్యార్థులకు ఈ కళాశాలలో ఉచిత విద్య అందించారు. నారాయణ విద్యాసంస్థల సిబ్బంది ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. దీంతో ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్, మెడిసన్ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులపై సీట్లు సంపాదించుకున్నారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నారాయణ మానస పుత్రిక అయిన మున్సిపల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీని మూసేసింది. తెలుగుదేశం పార్టీకి, నారాయణకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా కళాశాల మూసేసిందనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తాయి. వైసీపీ రాజకీయ కక్ష కారణంగా పేద విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రజలు నారాయణకు విన్నవించుకున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో పేద విద్యార్థులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా, ఈ దఫా అంతకన్నా గొప్పగా ప్రభుత్వ సహకారంతో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు నారాయణ సిద్ధమయ్యారు. గత ప్రభుత్వంలో నెల్లూరు నగరం పరిధిలో చేసిన అభివృద్ధి పనుల తాలూకు ఫలితం ప్రస్తుత ఎన్నికల ప్రచారం సందర్భంగా నారాయణకు ఎదురుకావడంతో ఆయన మరింత ఉత్సాహంతో అభివృద్ధి పనులకు ఇప్పటి నుంచే వ్యూహరచన చేస్తున్నారు. ఎన్ని కల ప్రచారంలో నెల్లూరు ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతుండటంతో నగర ప్రజల రుణం తీర్చుకోవడానికి కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకొంటున్నారు. అందులో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోపే నెల్లూరులో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాలన్నది తన లక్ష్యంగా నారాయణ ఆంధ్ర జ్యోతికి తెలిపారు.

సామాజికవర్గాల వారీగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం

ఇంటింటి ప్రచారంలో భాగంగా పలు సామాజికవర్గాల ప్రజలు శుభకార్యాలు, అంతర్గత సమావేశాలు నిర్వహించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్న విషయం నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ప్రైవేటు కల్యాణ మండపాలను బుక్ చేసుకునే ఆర్థిక స్తోమత లేక ప్రజలు అల్లాడుతున్న విషయాన్ని నారాయణ గుర్తించారు. దీనికి పరిష్కారంగా నియోజకవర్గం పరిధిలో వివిధ సామాజికవర్గాలకు వేరువేరుగా కమ్యూనిటీ హాళ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రతి డివిజన్ పరిధిలో ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించడం ద్వారా తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకునే వీలు కలుగుతుంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవసరమైన అన్ని డివిజన్లలో, వివిధ సామాజికవర్గాల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మించి ఇవ్వడానికి నారాయణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.



నగర పేదలకు మరో 20వేల పక్కా ఇళ్లు

తెలుగుదేశం హయాంలో మంత్రి హోదాలో నగరంలో నారాయణ 20వేలకుపైగా పక్కా ఇళ్లు నిర్మించారు. ధనికులు నివాసం ఉండే గేటెడ్ కమ్యూనిటీ తరహాలో బహుళ అంతస్తుల భవనాలను పేదల కోసం నిర్మించారు. లబ్ధిదారులను నిర్మాణాల వద్దకు పిలిపించుకొని వారు కోరినట్లు నిర్మాణాల్లో మార్పులు చేర్పులు చేశారు. సరిగ్గా ఐదేళ్ల క్రితం ఇదే ఎన్నికల సమయంలో పక్కా ఇళ్లు మంజూరైన పేదలతో వెంకటేశ్వరపురం ప్రాంతం కళకళలాడేది. తమకు కేటాయించిన ఇళ్లు ఎలా ఉన్నాయి? ఎలా నిర్మించారో తెలుసుకోవడం కోసం వేలాది మంది ప్రజలు ప్రస్తుత టిడ్కో గృహాల వద్దకు బారులు బారులుగా వెళ్లే దృశ్యాలు కనిపించేవి. అయితే తిరిగి ఎన్నికలు వచ్చినా ఇప్పటి వరకు ప్రస్తుత ప్రభుత్వం ఆ ఇళ్లను పేదలకు ఇవ్వలేదు. నిర్మాణాల టెండర్లలో అవినీతి అన్నారు, నాణ్యత విషయంలో అనుమానం అన్నారు, రకరకాల కారణాలు చూపి టీడీపీ హయాంలో కట్టిన ఇళ్లను ఐదేళ్లపాటు పేదలకు ఇవ్వకుండానే వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. నారాయణ నేతృత్వంలో కట్టిన బహుళ అంతస్తుల భవనాలకు పేరు మార్చింది, రంగులు మార్చిందే తప్ప పూర్తి స్థాయిలో పేదల చేతికి బీగాలు మాత్రం ఇవ్వలేదు. ఎన్నికలు ముంచుకొస్తున్నాయనంగా రెండు నెలలకు ముందు లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇచ్చారు. అప్పటికే ఆ ఇళ్లలో తలుపులు, కిటికీలు, ఎలక్ట్రికల్ వైర్లు అన్నీ దొంగలెత్తుకుపోయారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా పేదలు తమ బాధలను నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ఇంకా చాలా మంది పేదలు తమకు తలదాచుకోవడానికి గూడు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నారాయణ నిర్ణయించుకున్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలో తన వ్యక్తిగత సిబ్బంది ద్వారా ఇళ్లు లేని పేదలను గుర్తించడం మొదలు పెట్టారు. సిటీలో మరో 20వేల మంది పేదలకు ఇళ్లు అవసరం, ఇంకో 10వేలు పెరిగినా ఫర్వాలేదు, నగర నియోజకవర్గంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనేది లక్ష్యమని చెబుతున్నారు. ఇల్లులేని ప్రతి ఒక్కరిని పిలిచి, పిలిచి ఇళ్లు ఇస్తా..!, ఇంతకు ముందు నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాల్లో కావాల్సిన సదుపాయాలన్నీ కల్పిస్తా..!, ఎంత ఖర్చయినా పర్లేదు, ప్రభుత్వం తో పోరాడి తీసుకొస్తా..అని నారాయణ ప్రజలకు హామీ ఇస్తున్నారు. నగరంలో పక్కా ఇళ్ల నిర్మాణాలను ప్రాధాన్యత అంశంగా నారాయణ గుర్తించారు.

మాగుంట విజయ కన్నుమూత



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 22 : మాజీ ఎంపీలు మాగుంట సుబ్బరామిరెడ్డి, పార్వతమ్మల కుమారుడు మాగుంట విజయ్‌రెడ్డి సోమవారం కన్నుమూశారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కొంతకాలంగా అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఎంతో భక్తిపరాయణు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలు ఆలయాల అభివృద్ధికి సహకరించారు. ఆయన పార్థివదేహాన్ని రెండు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపార సంస్థల ప్రతినిధులు దర్శించి నివాళులర్పించారు. మంగళవారం నెల్లూరులో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, విజయ్‌రెడ్డి అకాల మరణానికి రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు సంతాపం తెలియచేశారు. సోమవారం నగరంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో గల మాగుంట దివ్యాంగుల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాసరి రాజేంద్రప్రసాద్, మస్తానయ్య, ప్రిన్సిపాల్ గురునాథరావు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 22 : ప్రతి పౌరుడు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని నెల్లూరు జిల్లా స్వచ్ఛంద సంస్థల కన్వీనర్ కేఎస్ఎస్ బాబా పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఐఎంఎం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురికాకుండా, ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, శేషాద్రి, బాలు పాల్గొన్నారు.

కోవూరు, సర్వేపల్లి కాంగ్రెస్ అభ్యర్థుల మార్పు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 22 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల్లో మార్పు జరిగింది. కోవూరు నియోజకవర్గంలో గతంలో ప్రకటించిన నెల్టూరం బాక మోహన్ స్థానంలో నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని, సర్వేపల్లిలో గతంలో ప్రకటించిన పూల చంద్రశేఖర్ స్థానంలో శ్రీకాంత్ రెడ్డిని అధిష్టానం నియమించింది. కావలి నియోజకవర్గానికి పొదలకూరి కల్యాణ్‌ను ఎంపిక చేసింది.

అడక్కుండానే అభివృద్ధి చేశా!

నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి నారాయణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 22 : నెల్లూరును అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో దేశ, విదేశాల్లోని వసతులు నగరంలో కల్పించే దిశగా ప్రజలు అడగకుండానే రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేశానని నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసేందుకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఆర్వో వికాస్ మర్మత్‌కు అందచేశారు. ఆయన సతీమణి రమాదేవి మరో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందించారు. అనంతరం కార్యాలయం బయట మాట్లాడుతూ నెల్లూరులో 2014-19 మధ్య, 2019-24 మధ్య జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీ రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా అలంకార్ కూడలి నుంచి దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. కాగా, నెల్లూరు సిటీ వైసీపీ అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ తరపున ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నామినేషను దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొన్నపూడి శ్యామల, భారత్ యువజన చైతన్య పార్టీ నుంచి కాళహస్తి చెంచు మహేష్ నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందచేశారు.

యువత భవితే లక్ష్యం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 22 : యువత ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 46వ డివిజన్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ సతీమణి రమాదేవి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తాళ్లపాక అనూరాధ, నేతలు పాల్గొన్నారు. కాగా, రానున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో వలంటీర్లకు ఉజ్వల భవిత ఉంటుందని నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని పలువురు వలంటీర్లు నారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు.


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న నారాయణ


వలంటీర్‌తో మాట్లాడుతున్న నారాయణ

పశువుల కొట్టాంలో అగ్ని ప్రమాదం

● మంటల్లో చిక్కుకుని గాయపడిన ఆవులు, ఎడ్లు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 22: పశువుల కొట్టాంలో అగ్గి రవ్వలు పడి గడ్డివాము అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో కొట్టాంలో కట్టేసి ఉన్న ఎడ్లు, ఆవులు మంటల్లో చిక్కుకుని గాయపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకొని ఆ మూగజీవాలను ప్రమాదం నుంచి తప్పించి, మంటలను అదుపు చేశారు. అగ్నిమాపకశాఖాధికారుల సమాచారం మేరకు.. నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలోని నాగాళ్లమ్మ గుడి పక్కనే యాసిన్, రజియా, శ్రీకాంత్, జితేష్‌లు రేకులతో పశువుల కొట్టాన్ని నిర్మించారు. ఆవులు, ఎడ్ల మేత కోసం షెడ్డుకు పక్కనే గడ్డి వాము వేశారు. సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి షెడ్డుకు పక్కగా విసిరేశారు. దీంతో నిప్పు రవ్వలు రగులుకొని మంటలు వ్యాపించాయి. దీంతో షెడ్డులో ఉన్న ఆవులు, ఎడ్లు నరకయాతన అనుభవిస్తూ పెద్దగా అరవడం ప్రారంభించాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు ఎడ్లు, రెండు ఆవులు తీవ్రంగా పడ్డాయి.


మంటలు ఆర్పి పశువులను రక్షిస్తున్న ఫైర్ సిబ్బంది



నామినేషన్ వేసేందుకు ప్రదర్శనగా వస్తున్న తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌తో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తదితరులు



నాలుగో రోజు 42 నామినేషన్లు

పార్లమెంటుకు ఐదు... అసెంబ్లీకి 37 దాఖలు

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లావ్యాప్తంగా సోమవారం 42 నామినేషన్లు దాఖలయ్యాయి.తిరుపతి పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, వైసీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి నామినేషన్లు వేశారు. అలాగే అసెంబ్లీ స్థానాలకు సంబంధించి చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకటమణిప్రసాద్ అలియాస్ పులివర్తి నానీ, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసులు అలియాస్ వాసు నామినేషన్లు వేశారు. సత్యవేడు నుంచీ టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు , సూళ్ళూరుపేట నుంచీ వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య ,గూడూరు నుంచీ టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి చిల్లకూరు వేమయ్య,వెంకటగిరి నుంచీ కాంగ్రెస్ అభ్యర్థి పంటా శ్రీనివాసులురెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

ఇతర పార్టీలు, స్వతంత్రుల తరపున...

తిరుపతి పార్లమెంటుకు వైసీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి సతీమణి నవ్య కిరణ్ వైసీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.జై హిందుస్థాన్ పార్టీ తరపున అక్కిలిగుంట మధు, జనతా కాంగ్రెస్ పార్టీ తరపున ఉమాదేవి నామినేషన్లు సమర్పించారు.తిరుపతి అసెంబ్లీకి బీఎస్పీ తరపున జే.వే ణుగోపాలరాజు, జై హిందూస్థాన్ పార్టీ తరపున ఎం.నీలకంఠ, ఇండిపెండెంట్లుగా అక్కిపల్లి మునికృష్ణయ్య, బ్యాంగి నవీన్ వున్నారు. చంద్రగిరికి పది మంది నామినేషన్లు వేయగా వారిలో నవ భారత నిర్మాణ సేవా పార్టీ తరపున పి.విశ్వనాధరెడ్డి, టీడీపీ డమ్మీ అభ్యర్థిగా కె.గానసుధ అలియాస్ పులివర్తి సుధారెడ్డి, జై హిందూస్థాన్ పార్టీ నుంచీ ఎం.నీలకంఠ, జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ నుంచీ ఎల్.ప్రసాద్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచీ తురక అమరనాథ్, జనతా కాంగ్రెస్ పార్టీ నుంచీ ఎం.ఉమాదేవి, ఇండిపెండెంట్లుగా కె.రాము, కె.సాయిచంద్రిక వున్నారు. సత్యవేడుకు నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఇండిపెండెంట్లు వేంపల్లి కృష్ణారావు, సి.సుప్రియ వున్నారు. శ్రీకాళహస్తికి ఆరుగురు నామినేషన్లు వేయగా అందులో బీఎస్పీ తరపున కుంట్రపాకు సురేంద్రబాబు, కుంట్రపాకు మునీశ్వర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున అక్కిరాల పావని, జై భారత్ నేషనల్ పార్టీ నుంచీ రొమ్మాల నిరంజన్‌రెడ్డి, ఇండిపెండెంట్లుగా పి.నాగరాజనాయుడు,వి.రమేష్ వున్నారు. సూళ్ళూరుపేటలో ఐదుగురు నామినేషన్లు ఫైల్ చేయగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున కందాటి రజనీకాంత్, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా కిలివేటి సుభాషిణి, బీఎస్పీ తరపున తొప్పాని రమణయ్య, ఇండిపెండెంటుగా నిడిగుంట అరుణ నామినేషన్లు సమర్పించారు. గూడూరులో టీడీపీ డమ్మీ అభ్యర్థులుగా పాశం జశ్వంత్ కుమార్, గోనె సంధ్యారాణి, పాశం సురేష్ కుమార్, పిరమిడ్ పార్టీ తరపున డి.పోలమ్మ, ఇండిపెండెంటుగా కమతం కామాక్షి నామినేషన్లు సమర్పించారు.



స్వర్ణరథంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి



స్వర్ణరథంలో మలయప్ప విహారం

తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):శ్రీవారి వసంతోత్సవాల్లో భాగంగా తిరుమల వసంతమండపంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం కన్నులపండువగా జరిగింది. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ల, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. తర్వాత స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. కాగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడవీధుల్లో స్వర్ణరథంపై విహరించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిగిన ఈ స్వర్ణరథోత్సవంలో భక్తులు పాల్గొని గోవిందనామాలు, కర్పూర హారతులతో ఉత్సవమూర్తుల కటాక్షాన్ని అందుకున్నారు.మంగళవారం శ్రీభూదేవి సమేత మలయప్పస్వామితో పాటు రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి, సీతారామలక్ష్మణ సమేత అంజనేయస్వామి ఉత్సవమూర్తులను కూడా వసంత మండపంలో కొలువుదీర్చి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.

పది ఫలితాల్లో 10వ స్థానం

- గత ఏడాదితో పోల్చితే రెండు స్థానాలు కిందికి
- ఉత్తీర్ణత శాతంలో 15.01 శాతం వృద్ధి
- 91.96శాతం ఉత్తీర్ణతతో బాలికల పైచేయి

మేనేజ్‌మెంట్ల వారీగా ఉత్తీర్ణత శాతం

ఏపీ మోడల్ స్కూల్స్	96.03
ఏపీఆర్ఈఐఎస్ స్కూల్స్	98.77,
ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్	95.60
ఏపీటీడబ్ల్యూఆర్	83.97
కేజీబీవీ స్కూల్స్	85.79,
ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలు	99.75
మున్సిపల్ పాఠశాలలు	81.22
ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్	90.78
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్	98.39
ప్రభుత్వ పాఠశాలలు	82.26
జడ్పీ పాఠశాలలు	83.56

మండలాల వారీగా ఉత్తీర్ణత శాతం

ఎర్రావారిపాళెం	98.08
తిరుపతి అర్బన్	95.97
నాగలాపురం	95.73
కేవీబీ పురం	95.09
పిచ్చాటూరు	94.02
సత్యవేడు	93.45
డక్కిలి	93.15
శ్రీకాళహస్తి	92.53
పుత్తూరు	92.44
చంద్రగిరి	92.51
చిన్నగొట్టిగల్లు	92.42
బీఎన్ కండ్రిగ	92.24
ఆర్సీపురం	91.64
ఏర్పేడు	91.58
వడమాలపేట	91.27
కోట	90.73
పాకాల	90.59
వరదయ్యపాళెం	90.31
చిట్టమూరు	89.53
రేణిగుంట	88.94
చిల్లకూరు	88
గూడూరు	87.55
వాకాడు	87.50
తిరుపతి రూరల్	87.35
ఓజిలి	87.17
తొట్టంబేడు	86.88
సూళ్లూరుపేట	85.47
వెంకటగిరి	85.02
నాయుడుపేట	84.62
పెళ్లకూరు	84.02
బాలాయపల్లి	81.86
నారాయణవనం	81.50
దొరవారిసత్రం	75.79
తడ	69.94



595 కె.పాంచజన్య,డీవీసత్రం గురుకుల పాఠశాల | 595 ఛార్మి, తిరుచానూరు | 593 శ్రీవర్షిత, గూడూరు | 593 టి.పవన్, కోట గురుకుల పాఠశాల | 592 జనని, బండారుపల్లి, ఏర్పేడు మండలం | 592 సాయికిషోర్, మేనకూరు జడ్పీ హైస్కూల్, నాయుడుపేట | 590 చారుమతి, కేవీబీపురం మోడల్ స్కూల్, పిచ్చాటూరు | 588 కె.చిన్మయి, చంద్రగిరి హైస్కూల్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది జిల్లా 10వ స్థానంలో నిలిచింది. గతేడాదిలో 75.70శాతం ఉత్తీర్ణతతో 8వస్థానంలో నిలిచిన జిల్లా..ఈ ఏడాది 90.07శాతం ఉత్తీర్ణత సాధించినా పదవస్థానానికి దిగజారింది.బాలుర కన్నా బాలికలు 2.38శాతం అధిక ఉత్తీర్ణత సాధించి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. రెగ్యులర్ విభాగంలో 13,997మంది బాలురకు 12,538మంది పాసై 89.58శాతం ఉత్తీర్ణత, 12,628మంది బాలికలకు 11,613మంది పాసై 91.96శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మొత్తం 26,625మంది విద్యార్థుల్లో 24,151మంది పాసై 90.71శాతం ఉత్తీర్ణత సాధించారని డీఈవో శేఖర్ వెల్లడించారు.వీరిలో 20,161 మంది ప్రథమ శ్రేణి, 2,694 మంది ద్వితీయ శ్రేణి, 1,293 మంది తృతీయశ్రేణిలో పాసయ్యారు. జిల్లాలో 204 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఎర్రావారిపాళెం మండలం 98.08 ఉత్తీర్ణతతో అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా ఆరు జడ్పీ హైస్కూళ్లు వందశాతం ఫలితాలు సాధించాయి.తడ మండలం 69.94శాతం అత్యల్ప ఉత్తీర్ణత నమోదు చేసిందని వివరించారు. ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలు అత్యధికంగా 99.75 ఉత్తీర్ణతను సాధించాయని తెలిపారు. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే తెలుగులో 95.74, హిందీలో 98.54, ఇంగ్లీషులో 97.83, గణితంలో 94.65, జనర్ సైన్స్‌లో 93.28, సోషల్ స్టడీస్‌లో 95.54 ఉత్తీర్ణత శాతం నమోదైందన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో టాపర్లు:

కె. లక్ష్మీప్రియ (ఎస్ఎస్‌టీ మున్సిపల్ హైస్కూల్, శ్రీకాళహస్తి) 596 మార్కులు, కె. పాంచజన్య (ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, దొరవారి సత్రం) 595, టి. పవన్ (ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, కోట) 593, బి. జనని (జడ్పీ హైస్కూల్, బండారుపల్లె, ఏర్పేడు) 592, ఎన్.సాయికిషోర్ (జడ్పీ హైస్కూల్, మేనకూరు, నాయుడుపేట) 591, కె. చారుమతి (ఏపీ మోడల్ స్కూల్, కేవీబీ పురం) 590, ఎస్ కస్తూరి (జడ్పీ బాలికల హైస్కూల్, నారాయణవనం) 590, జి.యోగేష్ (జడ్పీ హైస్కూల్, తొండమనాడు, శ్రీకాళహస్తి) 590, జి.లక్ష్మణ్ (మున్సిపల్ హైస్కూల్, ఆర్ఎస్ మాడ వీధి, తిరుపతి) 590, ఏహెచ్ తౌఫిక (జడ్పీ బాలికల హైస్కూల్, నారాయణవనం) 589, సి.అభిలాష్ (జడ్పీ హైస్కూల్, తొండమనాడు, శ్రీకాళహస్తి) 589, కె.తులసి (ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఎస్‌జీఎస్, కాసా గార్డెన్, శ్రీకాళహస్తి) 589, ఎస్.తరుణ్‌కుమార్ (ఎస్వీ హైస్కూల్, తిరుపతి) 589, బి.పల్లవి (జడ్పీ హైస్కూల్, వరదయ్యపాళెం) 589, కె.మునికుమార్ (జడ్పీ హైస్కూల్, వల్లివేడు, వెంకటగిరి) 589మార్కులు.

నేటినుంచి వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు మంగళవారం నుంచి మే 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని డీఈవో శేఖర్ తెలిపారు.విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి వారిద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఫీజులుకూడా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఆన్‌లైన్ ఫారం పూర్తి చేసేందుకు... 2024 మార్చి ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు హాజరైన పాఠశాల నుంచి విద్యార్థుల జాబితా, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేయాలనుకుంటున్న సబ్జెక్టులు, పేపర్ల వివరాలు, విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబరు, తల్లిదండ్రుల ఈమెయిల్ ఐడీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ప్రతి జవాబు స్క్రిప్ట్ రీకౌంటింగ్‌కు రూ. 500, ప్రతి సబ్జెక్టు స్క్రిప్ట్ రీ వెరిఫికేషన్‌కు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుందని డీఈవో వివరించారు.

గుండెకు, ఊపిరితిత్తులకు

మధ్యలో బుల్లెట్లు

- ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడిన రుయా వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22: గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో శరీరంలోకి రెండు బుల్లెట్లు దిగిన ఓ వ్యక్తి ప్రాణాలను అరుదైన శస్త్రచికిత్సతో తిరుపతిలోని రుయాస్పతి వైద్యులు కాపాడారు. ఆ వివరాలను సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు మీడియాకు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం పసలవాండ్లపల్లికి చెందిన విశ్వనాథ్(38)పై కుటుంబ కలహాలతో సొంత అన్న నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో విశ్వనాథ్ శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. బాధితుడిని కుటుంబీకులు ఈనెల 18వ తేదీన రుయాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా.. గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో రెండు బుల్లెట్లు ఉన్నాయని గుర్తించారు. వెంటనే కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ ఆధ్వర్యంలో ఆధునిక పెరికాడియంలో పద్ధతిలో శస్త్రచికిత్స చేసి బుల్లెట్లను తొలగించారు. బాధితుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడు. ఇటువంటి సర్జరీ చేయడం సాధారణం విషయం కాదని, బుల్లెట్లను తొలగించే క్రమంలో ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మ, క్లినికల్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ్‌ను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

కోత, కుట్లు లేకుండా వెరికోస్ వెయిన్ శస్త్ర చికిత్స

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రుయాస్పత్రిలో కోత, కుట్లు లేకుండా తొలిసారిగా వెరికోస్ వెయిన్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. రెండ్రోజుల కిందట రాయచోటి రాయుడు కాలనీకి చెందిన వెంకట్రమణ(51) అనే వ్యక్తి వెరికోస్ వెయిన్‌తో బాధపడుతూ రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యపరీక్షలు చేశాక కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ, డాక్టర్ రాదా ఆధ్వర్యంలో రేడియో ఫ్రీక్వెన్సీ ఎబులేషన్ ఫామ్ స్క్లీరో థెరపీ(ఆర్ఎఫ్ఏ) పద్ధతిలో ఎటువంటి కోత, కుట్లు లేకుండా శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని రవిప్రభు వివరించారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీచర్ సస్పెన్షన్

నగరి ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఓ టీచర్ సస్పెండయ్యారు.నగరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే చంద్రారెడ్డి ఈ నెల 8వ తేదిన కీళపట్టులో మంత్రి రోజా భర్త సెల్వమణితో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో మీడియాలో కథనాలు వెలువడ్డాయి.ఈ విషయమై స్పందించిన చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి ఇటీవల చంద్రారెడ్డిని సస్పెండ్ చేశారు.

పూడి- ఏర్పేడు మధ్య నూతన రైలుమార్గం




తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 22: పూడి- ఏర్పేడు రైల్వేస్టేషన్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రైల్వే బోర్డు చర్యలు ప్రారంభించింది. దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశంలోని ప్రధాన నగరాలకు తక్కువ సమయంలో వస్తు రవాణా చేయడానికి రైల్వే బోర్డు ఈ నూతన మార్గాన్ని వేయడానికి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్లు పూడి నుంచి రేణిగుంట రైల్వే జంక్షన్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి ముంబాయి, విజయవాడ మార్గాలవైపు వెళతాయి. సదరన్ రైల్వే నుంచి ఉత్తర భారత దేశంలోని ప్రధాన నగరాలకు వస్తు రవాణా చేయడానికి రేణిగుంట రైల్వే జంక్షన్‌లో కొంత ఆలస్యం జరుగుతోందని రైల్వే బోర్డు అధ్యయనం చేసింది. ఈ మార్గంలో గూడ్స్ రైళ్లతో పాటు సూపర్ ఫాస్ట్ రైళ్లు కూడా రాకపోకలు నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు గుర్తించారు. రైల్వే నిబంధనల మేరకు ప్రాథమిక సర్వే నిర్వహించారు. పూడి నుంచి ఏర్పేడు రైల్వేస్టేషన్ వరకు 27 కిలోమీటర్ల దూరం సర్వే చేసినట్లు సమాచారం. ఈ మార్గంలో ఒక రైల్వేస్టేషన్ కూడా వస్తుంది. ఈ రైలు మార్గం పూర్తిచేస్తే రేణిగుంట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు రేణిగుంట రైల్వే జంక్షన్‌పై రైళ్ల రాకపోకల ఒత్తిడీ తగ్గే అవకాశాలున్నాయి. ఈప్రాంతం నుంచి రైతులు పండించే వస్తువులు కూడా దూర ప్రాంతాలకు రవాణా చేసే అవకాశం ఏర్పడనుంది. అలాగే రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని భారీ పరిశ్రమల ఉత్పత్తులు కూడా రవాణా చేయడానికి అనుకూలంగా ఉంటుంది.

ప్యాకేజీల కోసం పాకులాట !

ఓవైపు ఎండలు దంచేస్తుంటే.. మరోవైపు ఉదయగిరి రాజకీయం అంతకన్నా హీటెక్కి స్తోంది. అందుకు ప్రధాన కారణం టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఇద్దరూ తొలిసారిగా బరిలో నిలవడమే. ఉదయగిరి పెద్దనియోజకవర్గం కావడంతో అభ్యర్థులకు ఆయా మండలాలపై పూర్తిస్థాయిలో పట్టు లేదు. అంతేకాక ద్వితీయ శ్రేణి నాయకుల తీరుతెన్నులపై కూడా అవ గాహన లేదు. దీంతో ప్రతినిత్యం అభ్యర్థుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తమదైన శైలిలో గ్రామ, మండల నేతలు గొప్పలు చెప్పుకుంటున్నరు. ఓటర్లను ప్రభావితం చేసే సత్తా లేనివారు కూడా నాయకులుగా చెలామణి అవుతూ ప్యాకేజీల కోసం పాకులాడు తున్నారు. బరిలో నిలిచిన వారు ఆర్థికంగా బలమైనవారు కావడంతో గెలుపు కోసం ఒక్కొక్కరు రూ. 100 కోట్లకుపైగా ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం ఆశావాదులకు కలిసొచ్చింది. నాలుగేళ్ల కుపైగా ఎక్కడా కనిపించని కొంతమంది నాయకులు ప్రస్తుతం అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏ గ్రామంలో ఎవరికి ప్రాధాన్యత కల్పించాలో, ఎంతమేర ఖర్చు పెడితే ఎన్ని ఓట్లు పడవచ్చనే తాపత్ర యం అభ్యర్థులను వెంటాడుతుంది. ఈ నేప థ్యంలో ఓట్ల కోసం అభ్యర్థులు, ప్యాకేజీల కోసం నా యకులు ఎత్తుకు పైఎత్తులు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.ఈ తరుణంలో ఓటర్లు మాత్రం ఎటువైపు మొగ్గ చూపాలో తెలియక అయోమయంలో ఉన్నారు.

- వరికుంటపాడు



బూత్‌లో 1400 ఓట్లే ఎందుకు ?

ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లే ఉండేలా అధికారులు ఏర్పాటు చేస్తారు. ఇలా ఎందు కు చేస్తారో తెలుసా..? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు ఒకదాని కొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎంలకు అనుసంధా నంగా ఉండే వీవీ ప్యాడ్‌లో కాగితాన్ని పొందుపరు స్తారు. ఇది 1450 స్లిప్పుల ను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాడ్ లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కూడా కనిపి స్తుంది. అందులో 50 వరకు కాగితం స్లిప్పులు ఓటింగ్ రోజు మాక్ పోలింగ్‌కు వాడతారు. అందుకే ప్రతి పోలింగ్‌బూత్‌లో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- ఉదయగిరి

తెలుసుకుందాం




'బీఏఎస్'కు మంగళం

- నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు
- 2008-09లో పథకం ప్రారంభం
- ఐదేళ్లుగా అమలుకాని వైనం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్రనష్టం కలిగించారు. ఎంతో ఆర్భాటంగా 2008-09 విద్యాసంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఎంతోమంది పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో ఉచితంగా చదువుకునేవారు. ప్రతి సంవత్సరం 1వ తరగతిలో వంద మందిని ఎంపిక చేసేవారు. వారు అందుబాటులో ఉన్న పాఠశాలలో డేస్కాలర్‌గా చదువుకునేవారు. అలాగే 5వ తరగతిలో రెసిడెన్షియల్ పద్ధతిలో 200మందికి అవకాశం కల్పించేవారు. దీంతో నిరుపేదలైన తల్లిదండ్రులు ఎంతో ఊరట చెందేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేదవారు కష్టాలు పడుతున్నారు. నాడు-నేడులో ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు తరగతి గదుల నిర్మాణమే ముఖ్యం కాదు... విద్యార్థుల బాగోగులను కూడా ప్రభుత్వం పట్టించుకోవాలి.

- నెల్లూరు (వీఆర్సీ)



నా ఓటు... నీకేనన్నా !

- ఎవరు పిలిచినా వెంట వెళుతున్న ఓటర్లు

ఎన్నికలవేళ గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏపార్టీ నేత పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి తరలివెళ్తున్నారు. ఈ విషయంపై ప్రతిపక్ష నేత ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచారు... వెళ్లాం.. కానీ ఓటు మాత్రం మీ పార్టీకేనని చెబుతున్నారు. దీంతో అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బం ది ఉండకూడ దన్న ఉద్దేశంతోనే కొందమంది అలా ప్రవర్తిస్తున్నారు. టీడీపీ, వైసీపీ నాయకులు గ్రామాల్లో అర్ధరాత్రి వరకు ప్రచారాలు చేస్తున్నారు. అభ్య ర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా స్వాగతం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు ముందురోజే ఇంటింటికెళ్లి తమ నాయకుడి ప్రచారానికి రావాలని కోరుతున్నారు. ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం.. అంత వరకు ఏ పార్టీ నాయకులు పిలిచినా వెళ్తాం.. అంటూ మరికొందరు తెగేసి చెబుతున్నారు.

- ఉదయగిరి

ఓటరు నాడి



అభిమానంతో ఓటు వేసే వాళ్లం



నా వయసు 80 ఏళ్లు. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో ఎప్పుడూ ఇలాంటి ప్రచార ఆర్భాటాలు లేవు. ప్రలోభాలు కూడా లేవు. ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఊరికి ఓ లారీ పంపేవారు. ఆ లారీ ఎక్కి ఓటు వేసేందుకు వెళ్లే వాళ్లం. ఇప్పుడేమో కార్లు పెట్టి మరీ తీసుకెళుతున్నారు. గ్రామానికి ఓ నాయకుడు వస్తే బారులుగా నిల్చోని చూసేవాళ్లం. కానీ ఇప్పుడు డబ్బులు పెట్టి మరీ బలవంతంగా తీసుకెళ్తున్నారు. మా రోజుల్లో అభిమానంతో ఓట్లు వేసేవాళ్లం. ఇప్పుడే ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే ఓటు వేస్తున్నారు.

- కవరగిరి ఇస్తేరమ్మ, అల్లూరు

చల్ చల్ గుర్రం!

ఓటర్లను ఆకట్టుకోవడం కోసం అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు టిఫిన్ అంగళ్లలో బోండాలు వేస్తే మరికొందరు టీ వేస్తున్నారు. ఇంకొందరు చంటిబిడ్డలను ఎత్తుకుని ముద్దాడడం, వృద్ధులతో మాటామంతీ కలపడం వంటివి చేస్తున్నారు. ఇంకా ప్రజల్లో మరింత ఆకర్షితులు అయ్యేందుకు ప్రచారాలలో గుర్రాలపై ఎక్కి కూడా స్వారీ చేస్తున్నారు. కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉలవపాడులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గుర్రంపై స్వారీ చేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. అలాగే కావలిలో స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుదాకర్ గుర్రంపై స్వారీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.



ఉలవపాడు : గుర్రంపై అభివాదం చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు



కావలిలో గుర్రంపై సుధాకర్

- ఉలవపాడు/కావలిటౌన్

ఓటు వేయకుంటే..?

పౌరుడి అస్థిత్వానికి ప్రతీక ఓటు. ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి దానికుంది. ఓ వ్యవస్థకు ప్రజాప్రతినిధి ఎంత అవసరమో, ఆ ప్రజాప్రతినిధిని ఎన్నుకోనేందుకు ఓటు అంతే అవసరం. కానీ చాలామంది ఓటును రాజకీయ తంతుగా భావిస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఓటు వేసి తీరాలి.

- ఓటు వినియోగించుకోకుంటే..

ఎవరైనా ఓటు హక్కు వినియోగించుకోకపోతే వారు జనాభా లెక్కల్లో లేనట్లే. ఇది అందరికీ తెలిసినా, విద్యావంతులు, ధనవంతులు ఓటు హక్కు వినియోగించు కోవడంలేదు.ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. ప్రజాస్వామ్య సంస్కారం అంటే ఎక్కడి నుంచో వచ్చింది కాదు. మనలో నుంచే వచ్చిందని గాంధీజీ అన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే పౌరులంతా తమ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కూడా ఆయన తెలిపారు.

- నెల్లూరు (సాంస్కృతికం)



'బాస్' లేకుండా ఫ్చ్...!

- సింహపురి పొలిటికల్ సెలబ్రిటీ ఆనం వివేకా
- నవ్విస్తూ... కవ్విస్తూ ఎన్నికల ప్రచారం
- ఆయన జ్ఞాపకాలు మననం చేసుకుంటున్న అభిమానులు

కొంతమంది ఏ దుస్తులు ధరించినా అందంగానే కనిపిస్తారు. ఇంకొందరు ఏ పనిచేసినా రాణిస్తారు. మరికొందరు ఏ అవతారం ఎత్తినా జనం హర్షిస్తారు. ఈఅన్ని కోణాల్లోనూ అందంగా, హుందాగా, హీరోగా, కమిడియన్‌గా కనిపించే అరుదైన నాయకుడు దివంగత నేత ఆనం వివేకానందరెడ్డి. ఈ పేరు చదవగానే, వినగానే ఆయన హావభావాలు గుర్తుకొచ్చి ప్రజల పెదవులపై చిరునవ్వు మెరుస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వివేకా ఓ పొలిటికల్ సెలబ్రిటీ. ఆయనన్నా, ఆయన చేసే విన్యాసాలన్నా చాలా మంది ప్రజలకు ఇష్టం. నెల్లూరు గల్లీలో అయినా అసెంబ్లీ హాలులో అయినా ఆయన తీరు ప్రత్యేకం. కిర్రు చెప్పులేసుకొని ఆయన అసెంబ్లీ హాలులో సందడి చేస్తుంటే ముఖ్య మంత్రులు, ప్రతిపక్ష నాయకులు అందరూ అలా నిలబడి చూడాల్సిందే. అభినం దనపూర్వకంగా చిరునవ్వు చిందించాల్సిందే. ఆయన వేషం, హావభావాలు, శరీర సౌష్టవం, మాటల్లో చిలిపితనం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తాయి. ఎంత మూడీగా ఉన్నా నవ్వు పుట్టిస్తాయి. అందుకే నెల్లూరు ప్రజలకు ఆయనంటే అంత ఇష్టం. నెల్లూరోళ్లకే కాదు రాష్ట్ర వ్యాప్తంగా చాలా మందికి ఆయనంటే ఇష్టం. ఆయన టీవీ తెరపై కనిపిస్తే చాలు అలా నిలబడిపోతారు. ఆయన బొమ్మ తెరమరుగైపోయే వరకు అలాగే నిలబడి చూ స్తారు. ఆనం వివేకానందరెడ్డి ఏమి చేస్తాడో, ఏమి మాట్లాడు తాడో వినాలని, చూడాలనే ఆసక్తి ఒకసారి ఆయన్ను చూసిన ఎవరికైనా కలగకమానదు. దానికి కారణం ఆయన హావభావాలు.

నెల్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):వేకువజామునే నిద్ర లేస్తారు. నెల్లూరులోని గల్లీగల్లీలో పర్యటిస్తాడు. టీ దుకాణం కనిపిస్తే అక్కడున్న వారితో కలిసి టీ తాగుతాడు. మాటామాటా కలిపి సమస్యలు తెలుసుకుంటాడు. రోడ్డు పక్కనున్న సెలూన్‌లోకి దూరిపోతాడు. కత్తెర, కత్తి చేతబట్టి నాకు చేతరాదా..! అంటూ సరదగా నవ్వుతాడు. పక్కనున్నవారిని నవ్విస్తాడు. బోండాలు వేసే అవ్వ దగ్గర కూర్చుంటాడు. పక్కకు జరుగవ్వా.. అంటూ తను బోండాలు వేస్తాడు. నీ కష్టం ఏమో చెప్పవ్వా అంటాడు. ఆ కష్టాన్ని తీర్చడానికి ప్రయత్నిస్తాడు. రిక్షావాలా దగ్గరకు వెళతాడు. ఒక బీడీ ఇవ్వన్నా అని అడిగి తీసుకొని దమ్ములాగుతూ ఫొటోలకు ఫోజులిస్తాడు. కుమ్మరి వీధిలోకి వెళతాడు కుండలు చేస్తానంటాడు. చాకలి వీధికి వెళతాడు, బట్టలు తికినట్లు పోజులిస్తాడు. ప్రతిపక్ష నాయకుడినైనా, ప్రత్యర్థినైనా తన వ్యంగ్య వ్యాఖ్యలతో ఉతికి ఆరేస్తాడు. పత్రికా ఫొటో గ్రాఫర్లకు, కెమెరాలకు ఆయనొక పండుగ. సాధారణ సమయాల్లోనే ఇలా కనిపించే వివేక ఇక ఎన్నికల సమ యంలో ఎలా కనిపిస్తాడు. జనాలను ఎలా రంజింపజేస్తాడు..!! ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన ప్రత్యేకమే. సాధారణ సమయాల్లో ఎన్ని రకాల దుస్తులు వేసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం ఖాకీ దుస్తులనే ధరిస్తారు. ఇదేమిటన్నా అని ఎవరైనా ప్రశ్నిస్తే ఖాకీ కార్మిక చిహ్నంరా చిన్నా అంటాడు. వీధికో అవతారం ఎత్తుతాడు, గంటకో విన్యాసం చేస్తాడు. ఒక వీధిలో కనిపించినట్లు మరో వీధిలో కనిపించడు. వేసిన కూలింగ్ గ్లాసులు మరో సారి వేయడు. ఒక రోజు వాడిన చెప్పులు ఇంకోసారి వాడడు. ఒకసారి చేసిన విన్యాసం మరోసారి చేయడు. ఆయన వేష ధారణ, మాటలు, చేతలు అన్ని ఎప్పటికప్పుడు ప్రత్యేకం. అంతే కాదు ఆయన రాజకీయ ఎత్తుగడలు అంతకన్నా ప్రత్యేకం. అందుకే పత్రికా ఫొటోగ్రాఫర్లు నిమిషం వదలక ఆయన వెంట పడుతుంటారు. ఆయన ఏ రూపంలో కనిపించినా నెల్లూరు ప్రజలు ఇష్టపడతారు. అందరికి అంతగా ఇష్టపడే వివేకానందరెడ్డి ఈ ఎన్నికల ప్రచారంలో లేరు. ఇక ఏ ఎన్నికల ప్రచారం లో కూడా కనిపించరు. కాని నెల్లూరు నగరంలోని వీధివీధి ఆయన జ్ఞాపకాలను తరచూ నెమరు వేసుకొంటూ నే ఉంటుంది. ఎన్నికల ప్రచారంలో ఎక్కడైనా వివేకా కనిపిస్తాడా...!!! అని ప్రతి మది వెదుకుతూనే ఉంటుంది. నెల్లూరు నగరంపై వివేక ముద్ర అలాంటిది మరి.



ఎన్నికలంటే ఖాకీ దుస్తులు ఉండాల్సిందే!



రాజకీయ పదును ఈయనకే సాధ్యం

జూలైలో పింఛన్ ఏడువేలంట్రా..!?

ఒరేయ్ సుబ్బులు... జూలైలో పించను ఏడువేలంట్రా... రేయ్ రామన్నా.. ఏడువేలేంటి... నాలుగువేలే కదా సెందర బాబు, జగను సెప్పింది. ఏడువేలు కాదన్నా... ఓరి నీ పాసుగాల నీ తెల్దంట్రా సుబ్బులు... నువ్వు టీవీ చూడట్లా... సూసానే నాలుగువలేనన్నారు రామన్న... రే కాదురా నాయనా సెందరబాబు సెప్పిందేంటంటే... ఇప్పుడు ఏప్రిల్ నుంచి మే, జూన్ నెలలకు కూడా వెయ్యెయ్యి కలిపి ముఖ్యమంత్రి కాగానే మరుసటి నెల జూలైలో పెంచిన నాలుగువేలకు ఈ మూడునెలల వెయ్యెయ్యి కలిపి ఏడువేలిస్తానని సెప్పిండ్రా నాయనా... ఓ అట్టాగా అయితే సెందరబాబు సీఎం అయితే మనకి జూలైలో ఏడువేలు వస్తది కదా..? ఆ తరువాత ఆగస్టు నుంచి ఎట్టోస్తయి రామన్నా... ఆగష్టు నుంచి నాలుగువేలే... ఓ అట్నా పెంచిన యెయ్యి ఈ నెల నుంచే అన్నమాట... అయితే ఈ ఇసయం మా ముసిల్దానికి సెప్తా రామన్నా... అంతే కాదురో ఇకలాంగులు ఉళ్లా వారికి అప్పుడు సెందరబాబు మూడేలు సెయ్యలా ? అదే మూడేలే జగన్ ఇస్తావచ్చిండు కదా ? ఆళ్లకి సెందర బాబు ఆరేలు సేస్తానన్నాడ్రా సుబ్బలు... అబ్బో ఆరేలే అంటే రోజుకు రెండొందలు. అయితే మన రంగన్నకి జూలై నుంచి ఆరేలు వస్తాయన్నమాట... పాపం ఇసయం రంగన్నకు సెప్పాల రామన్నా... రోజు నాతోటి ఏందిరా సుబ్బులు మీకు జగను రెండేలు నుంచి రెండొందలయాభై యేటేటా పెంచి మూడేలు సేసినాడుకానీ ఇకలాంగులమైన మాకు సిల్లిగవ్వ పెంచలేదురా ఉప్పుపొప్పు ధరలు పెరిగి ఫించను డబ్బులు దేనికీ సరిపోల్లేదురా అని సెప్పి రోజు బాధపడుతుంటాడు రంగన్నా... అయితే వాడికి సెప్పరా... సెప్తానన్నా... సోమవారం జలదంకి రచ్చబండ వద్ద వృద్ధులు సుబ్బయ్య, రామయ్యల మధ్య ఆసక్తిగా జరిగిన సంభాషణ ఇది.

- జలదంకి



తారు లేచిపోయి గ్రావెల్ బయట పడిన పల్లిపాళెం రహదారి (జగన్ నడిచిన దారి)



గుంతలమయమైన పల్లిపాళెం రహదారిలో వెళ్లలేక ఇసుకతో గుంతలు పూడ్చిన రైతులు



పల్లిపాళెం రహదారిలో కల్వర్ట్ కుంగడంతో ఏర్పాటు చేసిన రింగ్‌బండ్

జగనన్నా.. ఈ దారిని మరిచితివా!?


బాగుపడని పల్లెపాలెం రహదారి

ప్రతిపక్ష నాయకుడిగా జగన్ చేపట్టిన పాదయాత్ర సంగం మండలంలో 20 కి.మీ దూరం సాగింది. జిల్లా పర్యటలో భాగంగా 2018 ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో ఆయన సంగం మండలంలో పాదయాత్ర చేశారు. బుచ్చి దాటి దువ్వూరు వద్ద సంగం మండలంలోకి ప్రవేశించారు. దువ్వూరు వద్ద ఉన్న ఓ లేఅవుట్‌లో 5వ తేదీ రాత్రి బస చేసి 6న ఉదయం బయలు దేరారు. అప్పటికే సంగం - ముంబయి రహదారి మూడు వరుసల సిమెంట్ రోడ్డుగా మారింది. దీంతో గాంధీ జనసంఘం వరకు 8 కి.మీ నడిచి, అక్కడి నుంచి పల్లిపాళెం రహదారి మీదుగా సంగం వచ్చేందుకు రూట్ మ్యాప్ మార్చారు. అప్పటికే ఆ రహదారి వేసి ఏడేళ్ల గడిచిపోవడంతో గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై నడిచి సంగం చేరిన జగన్ బహిరంగ సభలో మాట్లాడుతూ 'పల్లెపాలెం రహదారి దుస్థితిని కళ్లారా చూశా. గుంతల రహదారిలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెబితే విన్నాను. రేపు మనం దరి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో అధ్వానంగా ఉన్న రహదారులకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి బాగుచేస్తా"నని హామీ ఇచ్చారు. జగన్ మాటలు నమ్మి 2019 ఎన్ని కల్లో ఆయన్ను గెలిపించారు. సీఎం అయ్యారు. కానీ పాదయాత్రలో ఇచ్చిన హామీని మాత్రం మరిచారు. ఆయన నడియాడిన రహదారికి సైతం ఈ ఐదేళ్ల కాలంలో తట్ట మట్టి వేసిన పాపాన పోలేదు. 2022 సెప్టెంబరులో సంగం బ్యారేజీ ప్రారంభానికి వచ్చిన సమ యంలో కలిగిర రహదారిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సీఎం రాకపోకలకు సౌకర్యంగా ఆగమేఘాల మీద కొరిమెర్ల వరకు ఐదుకిలోమీటర్ల రహదారి వేశా రు. అక్కడి నుంచి మిగిలిన రహదారికి ఇప్పటికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో అది మరింత గుంతలమయంగా తయారైంది. ఈ గుంతల రహదారిలో ప్రజలు ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. 'నేను నడిచాను... నేను చూశాను... నేను రహదారులను బాగు చేస్తాను'... అని గొప్పలు చెప్పిన జగన్ మాటలు మాయమాటలేనని మండల వాసులు విమర్శిస్తున్నారు.


- సంగం

ఆంధ్రజ్యోతి
మంగళవారం 23 ఏప్రిల్ 2024

జన కేతనం



ఈడ ఆయన పెత్తనం ఏందబ్బా..!



'ఈరోజు నామినేషన్ వేసేదానికి ఆయప్పతో కూడా పెద్దాయన వస్తున్నాడంటా కదబ్బా' అంటూ టీ తాగేందుకు వచ్చిన సుబ్బయ్యను అడిగాడు టీ కొట్టు వెంకటేశులు. 'ఔనబ్బా నాక్కూడా నిన్న మద్యాహ్నాందా తెలిసింది' అన్నాడు దీర్ఘంగా రాగం తీస్తూ సుబ్బయ్య. 'ఏందబ్బా ఇది... ఎక్కడో ఉండే ఆయనకి ఇక్కడ పెత్తనం ఎందుకబ్బా. ఈ అయిదేండ్లు ఇక్కడ మొత్తం గాలి చేసేశాడు. నడిచేదానికి రోడ్డు కూడా లేకుండా చేశాడు మహానుభావుడు. మళ్లీ ఇప్పుడు యాడనుంచో ఒకాయను తీసుకొచ్చి నిలబెడుతున్నాడు' విసుక్కుంటూ అన్నాడు వెంకటేశులు. పేపర్ చదువుతూ లీనమైపోయి ఉన్న రామయ్య తలపైకెత్తి ఇద్దరు వైపు చూస్తూ, 'నామినేషన్‌కు కూడా ఈయన రావాల్సిందేనా. ఏందోబో. మనూరు ఏమైపోతోందో. చివరకు మనమందరం మెడ్రాసుకు ఎళ్లిపోవాల్సిందేనా' అని విచారంగా అన్నాడు. సుబ్బయ్య కలగజేసుకుని 'ముందు మన నాయకులను అనాలి. ఆ పెద్దాయన చెప్పినట్టే పాడుతున్నారు'. ఇంతలో పేపర్ చదువుతున్న రామయ్య పేపర్ మడిచి టేబుల్‌పై పెడుతూ 'సరేలే..బ్బా. జనాలు మాత్రం ఈ సారి సరిగ్గా చేస్తారు చూడు. ఈ దెబ్బతో మళ్లీ ఆయన ఈడ కనబడడు' అని కసిగా అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ సంభాషణ అంతా సత్యవేడు పట్టణంలో ఒక టీ బంకు దగ్గర జరిగింది. వైసీపీ అభ్యర్థి గురించీ, ఇక్కడి రాజకీయాలను శాసిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి గురించీ స్థానిక ప్రజల్లో ఎంత చర్చ జరుగుతూ ఉందో ఈ సంభాషణ అద్దం పడుతోంది.

-సత్యవేడు

హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జా...!

ఇదీ మందు



నాయుడుపేట మూడో వార్డులో ప్రచారానికి ఇంటింటి గడప తొక్కుతున్న వైసీపీ నాయకులు అక్కడి ప్రజల మాటలతో అవాక్కయ్యారు. ఏ ఇంటికి జగన్ ఎంత మేలు చేశాడో లెక్కగట్టి ముద్రించిన కరపత్రాలు పంచుతూ ఓట్లడుగుతుండగా ఒక ఇంటి వాళ్లు కరపత్రం చూపిస్తూ 'హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జ. జా' అంటూ మొహంమీదే అనేశారు. జగన్ పథకాల లబ్ధి ఏదీ ఆ ఇంటికి దక్కకపోవడమే ఇందుకు కారణం. ప్రచారానికి వచ్చిన నాయకులు వారికి నచ్చజెప్పే మాటలేవో మొదలు పెట్టగానే ఆ ఇంటివారు విసుక్కున్నారు. 'సీఎం జగన్ సిద్ధం సభలో ఏం చెప్పినాడు' అని ప్రశ్నించారు. 'మీ బిడ్డ.. ఈ జగన్ మిమ్మల్ని కోరేది ఒకటే.. మీ కుటుంబంలో ఎవరికైనా మేలు జరిగే ఉంటే.. నాకు ఓటు వేయండి.. మంచి జరగకుంటే ఓటు వేయద్దు.' అన్నాడా లేదా అని నిలదీశారు. 'ఆ యబ్బాయి చెప్పిందే కదా.. మా ఇంటికి మేలేమీ జరగలేదు కాబట్టి మా ఓట్లు అడగద్దు' అని తెగేసి చెప్పేశారు. ఇదే తీరులో రెండు మూడు ఇళ్లలో ఎదురవడంతో వైసీపీ ప్రచార బృందం బిక్కమొహాలు వేసుకుని వెనుతిరిగారు.



- నాయుడుపేట/ టౌన్

ఆటా.. పాటా



ప్రచారాల్లో ట్రెండ్ మారింది. టెక్నాలజీకి ప్రాధాన్యం పెరిగింది. ఒకవైపు సోషల్ మీడియాను వేదికగా మార్చుకోగా మరోవైపు ప్రత్యక్ష ప్రచారాల్లోనూ వీడియో డిస్‌ప్లే స్కీన్‌లు వినియోగిస్తున్నారు. వీటిల్లో గ్రాఫిక్స్, తమ కోసం రూపొందించుకున్న పాటలు, షర్ట్ ఫిల్ములు వంటివి ప్రదర్శిస్తున్నారు. ఈ వాహనాలు పల్లెలను చుట్టేస్తున్నాయి. అచ్చం సినిమా టజర్‌ల లాగే అభ్యర్థులతో టీజర్‌లు రూపొందించి విడుదల చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే అభ్యర్థులను కీర్తిస్తూ పాటలు కట్టి పాడి వీడియో దృశ్యాలుగా షూట్ చేసి ప్రదర్శించడం మరొక ఎత్తు. పార్టీల ప్రచార పాటలతో పాటూ ఒక్కో అభ్యర్థి పేరుతో కనీసం పది పాటలు కొత్తగా రూపొందిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఈ పాటలు హోరెత్తుతున్నాయి. సినిమా స్టయిల్‌లో స్వరాలు కూర్చి అదే పద్ధతిలో డాన్సులు చేయించి వీటిని రికార్డు చేస్తున్నారు. యూట్యూబ్‌లోనూ ఇవి హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పాటలు రాయించి, రికార్డు చేయడం కోసం చెన్నై, హైదరాబాద్‌లకు పరుగులు తీస్తున్నారు.

- డక్కిలి

ఓటర్ల నాడి కోసం..

అభ్యర్థుల తరుపున కుటుంబసభ్యులు ప్రచారం చేయడం సాధారణం. గూడూరు బరిలో నిలిచిన ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరి పక్షాన వారి తనయులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే అభ్యర్థుల తనయులిద్దరూ వైద్యులు. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న పాశిం సునీల్‌కుమార్ కుమారుడు జశ్వంత్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీ జనరల్ మెడిసిన్ చేస్తున్నారు. అధికార వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తనయుడు రేవంత్‌చక్రవర్తి కూడా పీజీ ఆర్థోపెడిక్ చేస్తున్నారు. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ఈ యువ డాక్టర్లిద్దరు గూడూరులో తండ్రుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మేరిగ రేవంత్‌చక్రవర్తి



ప్రచారంలో పాశిం జశ్వంత్‌కుమార్

- గూడూరు అర్బన్



● చెప్పాడంటే.. చేయడంతే!

తిరుపతి
ఆంధ్రజ్యోతి

రద్దయిన డీకేటీ పట్టాలను నేను అధికారంలోకి రాగానే రైతులకు ఇప్పించేస్తా.

2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో పాదయాత్ర సందర్భంలో జగన్ అన్న మాట ఇది.

జగన్‌రెడ్డి హామీ ఇచ్చి 68 నెలలు గడచింది. మరి ఏం జరిగింది?



పట్టాలెక్కడ జగనా?

అనుప్పల్లి రైతుల గోడు

విపక్ష నేత వైఎస్ జగన్ 2018లో పాదయాత్ర సమయంలో అనుప్పల్లి పంచాయతీ నెమళ్ళగుంటపల్లిలో రైతు సదస్సు నిర్వహించారు. డీకేటీ పట్టాల రద్దు సమస్యను వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు నివేదించారు. తాను అధికారంలోకి రాగానే బాధిత రైతులకు భూములను తిరిగి ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఐదేళ్ళు గడిచిపోయినా పట్టాలు పునరుద్ధరించలేదు. బాధిత రైతులు ఇపుడు సీఎం జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డిపైనా మండిపడుతున్నారు.

అనుప్పల్లి సమస్య ఇదీ..

1996-2004 మధ్య అనుప్పల్లి పంచాయతీలో టీడీపీ ప్రభుత్వం, 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం 200 మంది పేద రైతులకు సుమారు 300 ఎకరాలు కేటాయించాయి. పట్టాలు కూడా జారీ చేశాయి. కొందరు ఆ పట్టాల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. మరికొందరు బోర్లు తవ్వుకుని మామిడి మొక్కలు నాటుకున్నారు. ఏడేళ్ళ కిందట రెవిన్యూ అధికారులు పట్టాల జారీ సక్రమంగా జరగలేదని రద్దుకు ప్రతిపాదించారు. సర్వే నంబరు 410 నుంచీ 493 వరకూ ఉన్న భూముల పట్టాలను రికార్డుల్లో నమోదు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడం రైతులకు శాపంగా మారింది. 2017లో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ఈ డీకేటీ పట్టాలను రద్దు చేశారు. బాధిత రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా న్యాయం జరగలేదు. విసిగి వేసారిన రైతులు భూములపై ఆశలు వదిలేసుకున్నారు.

జగన్‌ను నమ్మి చెడ్డా

ప్రభుత్వం మాకు 2.95 ఎకరాల డీకేటీ పట్టా ఇచ్చింది. దీని మీద బ్యాంకులో రుణం తీసుకున్నాం. అధికారులు తర్వాత పట్టా రద్దుచేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నా పేరు కనపడక రుణ మాఫీ వర్తించకుండా పోయింది. బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకుంటే వడ్డీ పెరిగి రూ.2 లక్షలు అయింది. పాదయాత్రలో జగన్ మా ఊరొస్తే గోడు వెళ్ళబోసుకున్నాం. అధికారంలోకి వస్తానే పట్టాలు ఇస్తామని తర్వాత పట్టించుకోలేదు. ఆయన్ను నమ్మి మోసపోయా.

- ఎన్.లక్ష్మమ్మ, అనుప్పల్లి



సీఎం అయ్యాక పట్టించుకోలేదు



మా స్వాధీనంలో ఉన్న 75 సెంట్ల భూమికి 2008లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అందులో మామిడి తోట పెట్టుకున్నా. కొన్నేళ్ళకు అధికారులు పట్టాను రద్దు చేశారు. ప్రతి గ్రామసభలో ఫిర్యాదు చేస్తూనే వున్నాం. న్యాయం జరగలేదు. పాదయాత్రలో జగన్‌కు కూడా చెప్పుకున్నాం. మాటిచ్చి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదు.

- చిన్నస్వామి, గోకులాపురం

ఎమ్మెల్యే కూడా న్యాయం చేయలేదు

పట్టాల రద్దు విషయం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చాలా సార్లు చెప్పాం. ఆయన కూడా న్యాయం చేయలేదు. జగన్ మా ఊరి కొచ్చినపుడు ఆయనకూ చెప్పాము. పట్టాలు రద్దు చేసినందున రుణమాఫీ కాలేదు. తీసుకున్న రుణానికి బ్యాంకు అధికారులు నోటీసుల మీద నోటీసులు పంపిస్తా వుంటే బిడ్డ పెళ్లికి పెట్టుకున్న డబ్బు కట్టేసినాము.

- కె.ధనలక్ష్మి, గోకులాపురం



మోసపోయా


2008లో మాకు 1.50 ఎకరా ఇచ్చారు. డీకేటీ పట్టా ఇచ్చినందున మామిడి మొక్కలు నాటుకున్నాము. తోట ఎదిగినాక 2017లో రెవెన్యూ అధికారులు పట్టా రద్దు చేశారు. ఆన్‌లైన్‌లో పేరు తీసేశారు.. అధికారంలోకి రాగానే డీకేటీ పట్టా తిరిగి ఇప్పిస్తామని జగన్ హామీ ఇచ్చారు. పదవీ కాలం కూడా పూర్తయిపోతున్నా మాకు మాత్రం న్యాయం చేయలేదు.



- బి.మోహనరాణి, అనుప్పల్లి

సిరా చుక్క కత

డక్కిలి, ఏప్రిల్ 22 : ఎన్నికల్లో ఓటు వేశాక పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క గుర్తుగా పెడుతుంటారు. దీంతో సదరు ఓటరు మరో ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఎప్పుడో రూపొందించిన నిబంధన ఇది. ఈ సిరా గుర్తు 72 గంటల పాటు చెరిగిపోదు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాదు. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ అనే పరిశ్రమ ఈ ఇంకును తయారు చేస్తోంది. 1962 నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ సిరానే ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందరగా చెరిగిపోదని నిపుణులు చెబుతారు.



తిరుపతి వర్తమానం



కూటమి కలయికతో స్పీడు తగ్గిన ఫ్యాను

సిటింగ్ ఎమ్మెల్యేకు బదులు ఆయన తనయుడు పోటీచేయడం, టీడీపీ కాకుండా దాని మిత్ర పక్షమైన జనసేన నుంచి చిత్తూరు సిటింగ్ ఎమ్మెల్యే బరిలో నిలబడటంతో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిక ఈసారి ఆసక్తిదాయకంగా మారింది. గత ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కిన వైసీపీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈదఫా తాను పోటీ చేయకుండా వారసునిగా కుమారుడు, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభినయరెడ్డికి పార్టీ టికెట్ సంపాదించుకున్నారు. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి బరిలో నిలిచారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● ఏకతాటిపైకి ఎన్డీఏ కూటమి నాయకులు ● వైసీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు
● ఆ పార్టీలో అవినీతి ఆరోపణల గుబులు

● పవన్ పర్యటనతో వైసీపీలో గుబులు

కొద్దిరోజుల క్రితం ఆరణి అభ్యర్థిత్వంపై తిరుపతి ఎన్డీఏ కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ)లోని అసమ్మతి పోరు తనకు ఉపకరిస్తుందని వైసీపీ ఆశలు పెట్టుకుంది. కానీ టీడీపీ, జనసేన అధినేతలు స్వయంగా జోక్యం చేసుకుని పార్టీ నాయకులలోని అసంతృప్తిని చల్లార్చారు. పవన్ కల్యాణ్ పర్యటనతో అసమ్మతి పటాపంచలైంది. దీంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. ఐదేళ్లుగా జరిగిన స్థానిక, ఉప, టౌన్ బ్యాంకు ఎన్నికలన్నింటిలోనూ ఫేక్ ఓట్లపైనే ఆధారపడ్డ అధికార పార్టీ, సార్వత్రిక ఎన్నికల్లోనూ అదేపంథాలో నడవాలన్న పన్నాగం సిద్ధం చేసుకున్నా ఈసారి బెడిసికొట్టింది. తన తండ్రికి ఆఖరి ఏడాది దక్కిన టీటీడీ చైర్మన్ పదవితో అడ్డగోలుగా శ్రీవారి నిధులు దుర్వినియోగమయ్యామనే విమర్శలు అభినయ్ విజయాన్ని ప్రభావితం చేస్తాయని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు అయిష్టంగానే ప్రచారంలో పాల్గొంటున్నట్టుగా కనిపిస్తోంది. ఫలితంగా అధికార వైసీపీలో మునుపటి ఉత్సాహం కనిపించడంలేదు.

అలుపెరగని ప్రచారం : జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఏడు పదుల వయస్సులోనూ ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తూ ఆతర్వాత కూటమి నాయకులతో ఇంటింటా తిరుగుతున్నారు. గాజు గ్లాసు గుర్తును ప్రజల చెంతకు తీసుకుపోతున్నారు. సొంత నిధులతో మసీదులు, ఈద్గా మైదానాల ఆధునీకరణ చేస్తామని రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించి ముస్లిం సోదరుల అభిమానాన్ని కూడగట్టుకున్నారు. కూటమి నాయకులందరూ ఏకతాటి మీదకు రావడంతో తిరుపతిలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ ఇంఛార్జి సుగుణమ్మ, జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్‌తో పాటు టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు మూకుమ్మడిగా ప్రచారంలో కదలడంతో కూటమి శ్రేణుల్లో సంబరం నెలకొంది. టీడీపీ సీనియర్ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి (పెద్దబ్బ) వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

చేరికలతో కూటమిలో ఉత్సాహం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వైసీపీ నేతలు అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణయ్య సోదరులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కార్పొరేటర్లుగా ఉన్న వారి ఇద్దరు కుమార్తెలు కూడా ఆ పార్టీనుంచి బయటకు వచ్చేశారు. జనసేన, టీడీపీలో నిత్యం చేరికలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొలకల మల్లిఖార్జున్ ఇటీవల పవన్ సమక్షంలో జనసేనలో చేరి నగరంలో భారీ ర్యాలీకూడా నిర్వహించారు. మరో యువనాయకుడు పాటకం వెంకటేష్ కూడా జనసేనలోకి చేరబోతున్నట్టు తెలుస్తోంది.

వామపక్షాల బలమేంటో...

ఇండియా కూటమిలో తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి దక్కింది. ఇక్కడ వామపక్షాల నేతలు వైసీపీ ఎమ్మెల్యేతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీతో పాటు వామపక్ష నేతలు వైసీపీ నేతలపై భూకబ్జాలు, దౌర్జన్యాలు, అవినీతి వంటి అనేక ఆరోపణలపై పల్లెత్తి మాట అన్న దాఖలాలు లేవు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం వెనుక భారీ అవినీతి జరిగిందని లోకమంతా కోడై కూసినా టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై వీరు ప్రశ్నించిందిగానీ, ఖండించిందీ లేదు. టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేశారంటూ కరుణాకరరెడ్డిని సన్మానాల్లో ముంచెత్తిన నాయకులు ఆయన కుమారుడిపై ఎలా పోరాడుతారో అని జనం అనుకుంటున్నారు.

ఏడు నామినేషన్ల దాఖలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 22: గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వివిధ పార్టీల అభ్యర్థులు తమ సహచరులతో కలిసి నామినేషన్ పత్రాలను సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్వోకు అందజేశారు. టవర్‌క్లాక్ వద్ద ర్యాలీలు నిలిపివేసి సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణ నుంచి ప్రతిపాదిత వ్యక్తులతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. పాశం సునీల్‌కుమార్ రెండు సెట్లు, ఆయన సతీమణి సంధ్యారాణి, ఆయన కుమారుడు జశ్వంత్‌కుమార్, ఆయన సోదరుడు సురేష్‌కుమార్ టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థిగా వేమయ్య, స్వతంత్ర అభ్యర్థిగా కామాక్షి, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా పోలమ్మ నామినేషన్లను అందజేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి వంద మీటర్ల దూరంలో అభ్యర్థులతోపాటు ఐదుగురు వచ్చేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

రాంకుమార్ రెడ్డే హౌస్ ఫర్ సేల్ బోర్డు పెట్టుకుంటాడు: కురుగొండ్ల


మీడియాతో మాట్లాడుతున్న కురుగొండ్ల

వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 22: ఎన్నికల తర్వాత వెంకటగిరిలో టీడీపీ టూలెట్ బోర్డు పెట్టుకోవాలన్న వైసీపీ అభ్యర్థి రాంకుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మండిపడ్డారు. సోమవారం చిన్నపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల మాట్లాడుతూ... ఎన్నికల తరువాత రాంకుమార్ రెడ్డే ఇంటిని అమ్ముకుని వెళ్తాడన్నారు. తాను స్థానికుడినని 365 రోజులు వెంకటగిరిలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటాన్నారు. కరోనా మహ్మారి సమయంలో ఇక్కడే ఉండి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నానే తప్ప పారిపోలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి సాయంత్రానికి నెల్లూరు, వాకాడుల్లో ఉన్న ఇంటికి వెళ్తారే కానీ వెంకటగిరిలో ఉండరన్నారు. అర్థరహితంగా విమర్శించకుండా నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. కాగా ఆయన వెంట టీడీపీ నాయకులు పప్పు చంద్రమౌళి రెడ్డి, బీరం రాజేశ్వరరావు, అవ్వారు సత్యనారాయణ, శ్రీరామదాసు గంగాధర్, వి.మధునాయుడు, గల్లా శ్రీనివాసులు, బాబు నాయుడు, దట్టం గురునాదం, మగ్గం వెంకటాచలం,చాన్నరెడ్డి, జనసేన పార్టీ నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ తదితరులు వున్నారు.

సమన్వయంతో విజయశ్రీని గెలిపించుకుంటాం


ప్రసంగిస్తున్న పరసారత్నం

ఓజిలి, ఏప్రిల్ 22: రానున్న ఎన్నికల్లో సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి విజయశ్రీని సమన్వయంతో పని చేసి గెలిపించుకుంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చెప్పారు. మాజీ మంత్రి పరసారత్నంలో కలిసి మండలం పున్నేపల్లి, నెమళ్ళపూడి, కరబల్లవోలు, సగుటూరు పంచాయతీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ తమ అరాచక పాలనతో పవిత్రమైన అసెంబ్లీని కౌరవ సభగా మార్చిందని, రానున్న ఎన్నికల్లో ఆ సభను పడగొట్టి తమ అధినేత చంద్రబాబను సగౌరవంగా గౌరవ సభలోకి పంపిస్తామన్నారు. జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తమ కూటమి చరిత్ర సృష్టిస్తుందన్నారు. అభ్యర్థి విజయశ్రీ మాట్లాడుతూ... తనను ఇక్కడి ప్రజలు ఆదరిస్తున్నది చూస్తుంటే అధికార పక్షానికి నిద్రపట్టడం లేదన్నారు. ఎస్ఆర్ఐ రాకేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా పున్నేపల్లికి చెందిన గ్రద్దగుంట ఎంపీటీసీ సభ్యురాలు కె.విజయమ్మ... నెలవల, జి.విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. పున్నేపల్లి, కరబల్లవోలుకు చెందిన 50 మందికిపైగా యువకులు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.నిరంజన్, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కె ఖలీల్, నారాయణరెడ్డి, తెలుగు మహిళ పవిత్రారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి పాదర్తి ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

వాకాడు/ బాలాయపల్లి, ఏప్రిల్ 22: వాకాడు పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న మద్యం దుకాణం నుంచి 10 క్వార్టర్ల మద్యాన్ని బెల్టు దుకాణానికి తరలిస్తున్న షేక్ రఫీని ఎస్ఐ పవన్‌కుమార్ అరెస్టు చేశారు. బాలాయపల్లి మండలంలోని వాక్యం గ్రామానికి చెందిన కోలా ప్రసాద్ బాలాయపల్లి బ్రాందీ షాపు నుంచి 16 మద్యం బాటిళ్లు, ముద్దా సుబ్రమణ్యం అనే వ్యక్తి 6 మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడడంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహబూబ్ సుబాని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

వాకాడు, ఏప్రిల్ 22 : మండలంలోని అశోక్‌పిల్లర్, గుండమ్మకాలనీ, వాకాడులో తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్, అసెంబ్లీ సెగ్మెంట్ అభ్యర్థి డాక్టర్ ఉయ్యాల రామకృష్ణరావులు తమను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా 5 గ్యారెంటీలు గల కరపత్రాలను పంపిణీ చేసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో దయాకర్, తేజోవతి తదితరులు ఉన్నారు. అలాగే సూళ్లూరుపేట, గూడూరు పట్టణాల్లో కూడా చింతామోహన్ ప్రచారం చేశారు.

వలంటీర్ల రాజీనామా

చిట్టమూరు/ తడ/ కోట, ఏప్రిల్ 22: చిట్టమూరు మండలంలోని 98 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తడ మండల పరిధిలోని వేనాడు గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు సోమవారం రాజీనామాబాట పట్టారు. కోట మండల పరిధిలోని తిన్నెలపూడి, వంజివాక, కోట, కొత్తపట్నం సచివాలయాలకు సంబంధించిన 17 మంది వలంటీర్లు తమ పోస్టులకు రాజీనామా చేశారు.

టీడీపీ అభ్యర్థి పాశం నామినేషన్

తరలివచ్చిన ఉమ్మడి కూటమి శ్రేణులు



ర్యాలీలో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 22: గూడూరు నియోజకవర్గ ఉమ్మడి కూటమి నుంచి టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ నామినేషన్ కార్యక్రమానికి సోమవారం ఉమ్మడి కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ముందుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని వినాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడ నుంచి ప్రచార రథంపై కూటమి నాయకులతో కలసి ప్రజలకు అభివాదం చేస్తూ సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ర్యాలీ నిర్వహించిన ఆసుపత్రిరోడ్డు, టవర్‌క్లాక్ సెంటర్ జనసందోహంతో నిండిపోయింది. కేరళ వాయిద్యాలు, తీన్‌మార్‌బ్యాండు. బాణ సంచా పేలుళ్ల మధ్య ర్యాలీ సాగింది. మార్గమధ్యంలోని పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలకు సునీల్‌కుమార్ నివాళి అర్పించారు. ర్యాలీ అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రంలో ఆర్వోకు నామినేషన్ అందించారు. నామినేషన్ అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ... టీడీపీ బలం కార్యకర్తలేనన్నారు. నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలను చూస్తుంటే వైసీపీపై వ్యతిరేకత ఏస్థాయిలో ఉందో అర్థమవుతోందన్నారు. పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ మాట్లాడుతూ... జనసందోహాన్ని చూస్తుంటే టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరని తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కిరణ్ కుమార్, ఎన్.జగన్మోహన్‌రెడ్డి, కె.హరిచంద్రారెడ్డి, జి.కిషోర్‌నాయుడు, కరిముల్లా, నానాజీ, రవినాయుడు, జశ్వంత్‌కుమార్, సంధ్యారాణి, ఎన్.భాస్కర్‌రెడ్డి, చాన్‌బాషా, ఏ.మస్తాన్‌నాయుడు, రుద్రకోటి సదాశివం, ఎం.శ్రావణి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జగన్ చేసిన అప్పుల భారం పిల్లల పైనే



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, ఏప్రిల్ 22: సీఎం జగన్ ఐదేళ్లలో చేసిన అప్పు రాష్ట్ర పిల్లలపైనే పడుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం డక్కిలి మడలం వీకేపైసముద్రానికి చెందిన వైసీపీ బీసీ నాయకులు ప్రసాద్, శ్రీరాములు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలేలశ్వరం రామచంద్రయ్య నాయుడు, వెలికంటి రమణారెడ్డి టీడీపీలో చేరారు. వారికి లక్ష్మీసాయిప్రియ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జగన్ చేసిన అప్పులు తీర్చకపోతే ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తుకు ఉండదన్నారు. యువతకు ఏది అవసరమో తెలుసుకొని అవన్నీ తన తండ్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

మైండ్‌గేమ్ రాజకీయాలు మానుకోండి

● వైసీపీ నేతలకు టీడీపీ హితువు

పెళ్లకూరు, ఏప్రిల్ 22 : సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుని మైండ్‌గేమ్ రాజకీయాలు ఆడుతున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మురళీకృష్ణారెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కె.శివకుమార్ విమర్శించారు. మండలంలోని తాళ్వాయిపాడులో జరిగిన సమావేశంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తమతో టీడీపీ నాయకులు టచ్‌లో ఉన్నారనీ... గతం కంటే మెజార్టీ వస్తుందని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. నిజంగా ఆయనకు దమ్ముంటే టచ్‌లో ఉన్న వాళ్ల వివరాలు బహిర్గతం చేయాలన్నారు. వైసీపీ నాయకులే తమతో టచ్ ఉన్నారని పేరం రమేష్‌నాయుడు చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి డి.నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం మధునాయుడు, డి.ప్రసాద్‌నాయుడు, వి.హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'ప్రభుత్వ' విద్యార్థుల ప్రతిభ



1.చిట్టమూరు మండలం మెట్టు పాఠశాల విద్యార్థిని పి.భవిత (586) 2. చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి జడపల్లి చరణ్ (586) 3. దొరవారిసత్రం గురుకుల పాఠశాల విద్యార్థి వి.లక్ష్మీచైతన్య(585) - 4. వెంకటగిరి మండలం వల్లివేడు పాఠశాలకు చెందిన మునికుమార్ (589) 5. జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కీర్తన (585)

బాలాయపల్లి, ఏప్రిల్22: మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల నుంచి 230 మంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో పరీక్షలు రాయగా 185 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలాయపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.పుష్ప అఖిల(557) మార్కులు, నిడిగల్లు పాఠశాల విద్యార్థిని ఎం.మంజూష (553) మార్కులు సాధించారు.

● సూళ్లూరుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శీనయ్య తెలిపారు. 608 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 476మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని పుసుపులేటి హరిణి(580), కోటపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కావలి శ్రావ్య (574), మంగళంపాడు హైస్కూల్ విద్యార్థి అజేయ్ (569) మార్కులు సాధించారు.

●గూడూరు: టెన్త్ పరీక్షా ఫలితాల్లో గూడూరు పట్టణ, మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. 632మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 486 మంది ఉత్తీర్ణత సాధించారు. విందూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జవహీరా(580) మార్కులు సాధించింది.

● ఓజిలి: మండలంలో టెన్త్‌లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 240మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 205 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

● తడ: టెన్త్ ఫలితాల్లో తడ బాలికోన్నత పాఠశాల నుంచి విద్యార్థిని బి. వెంకటకీర్తి (579), మోడల్ స్కూల్‌కు చెందిన కె.హరిణి (574) మార్కులు సాధించారు. మొత్తం 332 మంది హాజరుకాగా, 221 మంది ఉత్తీర్ణులయ్యారు.

● చిట్టమూరు: మండలంలో టెన్త్ పరీక్షలో 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బివి కృష్ణయ్య తెలిపారు. 353 మంది విద్యార్థులకు గాను 308 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారన్నారు. మెట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.

● దొరవారిసత్రం: మండలంలో టెన్త్ ఫలితాల్లో 76.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ఆరు జడ్పీహైస్కూళ్లు, బీసీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో 345 మందికి 263 మంది ఉత్తీర్ణత సాధించారు.

● వాకాడు: అంబేద్కర్ గురుకులం, బాలిరెడ్డి పాళెం ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 5 ప్రభుత్వ పాఠశాలలకు గాను 169 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 157 మంది ఉత్తీర్ణత సాధించడంతో 93శాతం ఫలితాలు వచ్చాయి.

● పెళ్లకూరు: టెన్త్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లొక్కు సువర్ణ 579, జి.శివచైతన్య తేజ 573 , చెంబేడు పాఠశాల పినాగతేజశ్రీ 565 మార్కులు సాధించారు. టెన్త్ ఫలితాల్లో 82 శాతం ఉతీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎం.శంకరయ్య తెలిపారు.

● చిల్లకూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో 85 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆయా పాఠశాలలకు సంబంధించి మొత్తం 401 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 344 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో మండలంలో 85 ఉత్తీర్ణత నమోదైంది. ఈ పరీక్షా ఫలితాల్లో చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జడపల్లి చరణ్ అనే విద్యార్థి 586 మార్కులు సాధించాడు.

● డక్కిలి: డక్కిలి జడ్పీహైస్కూల్ విద్యార్థి శ్రావ్యను సోమవారం పలువురు అధికారులు అభినందించారు. ఈ విద్యార్థి 10వ తరగతి పరీక్షల్లో 579 మార్కులు సాధించడంతో ఎంపీడీవో లీలామాధురి. ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, హెచ్ఎం నాగరాజు అభినందించి నగదు బహుమతి అందించారు. కాగా మండలంలో 248 మంది విద్యార్థులు 10వ తరగతి హాజరు కాగా 231 మంది ఉత్తీర్ణులయ్యారు.

● వెంకటగిరి టౌన్: వెంకటగిరిలో మొత్తం 723 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 576 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వల్లివేడు పాఠశాలకు చెందిన మునికుమార్ 589, జిల్లా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన 585, గురుకుల పాఠశాల విద్యార్థిని సాయిప్రియ 584, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని అత్తిఫా తహసీన్ 578, కేజీబీవీ పాఠశాల విద్యార్థి చందు శ్రీ 565 మర్కులు సాధించారని ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో ఎల్ఏపీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

గూడూరు, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి వంద శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన శ్రీవర్షిత అనే విద్యార్థినీ 593, సాయిసాత్విక్ 589, మితున్‌శ్రీసాయి 587 మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, హెచ్ఎం సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బాటలు వేద్దాం

కోట, ఏప్రిల్ 22: ఎన్డీయే అభ్యర్థులను గెలిపించుకుని అభివృద్ధికి బాటలు వేద్దామని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని రవినగర్, అరుణ థియేటర్ ప్రాంతాల్లో సోమవారం రాత్రి టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అదే విధంగా గూడూరు నియోజకవర్గాన్ని రెండింతలకు పైగా అభివృద్ధి చేయించాలంటే ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, జిల్లా కార్యదర్శి తీగల సురేష్‌బాబు, తూపిలి రాధాకృష్ణారెడ్డి, షంషుద్దీన్, దారాసురేష్, వంశీ, రామమూర్తి, మోహన్, తదితరులు ఉన్నారు.

ఎన్డీఏ కూటమిదే విజయం

● బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు - ర్యాలీలో పాల్గొన్న వెలగపల్లి వరప్రసాద రావు, కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 22 : వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని ఈ మేరకు ప్రజల స్పందన అలాగే ఉందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు. కేంద్రమంత్రి మురుగన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన నాయకుడు హరిప్రసాద్, బీజేపీ నాయకుడు నవీన్‌గుప్తాతో కలసి ఆయన నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. అంతకుముందు బాలాజీ కాలనీ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అక్కడ మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళి అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీ గోవింద రాజుస్వామి ఆలయం సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీతో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కార్యకర్తల్లో జోష్ కన్పించింది. నామినేషన్ అనంతరం ఆయన మాట్లాడుతూ... తిరుపతి ఎంపీ స్థానంలో తాను విజయం సాధించబోతున్నట్లుగా ప్రకటించారు. జగన్ అవినీతి, దౌర్జన్యాలే తనకు విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో టిక్కెట్ కేటాయించిన బీజేపీ అధిష్ఠానానికి సహకరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి, నగరి టీడీపీ అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్య, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, చంద్రప్ప, జనసేన నాయకులు వనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిరుపతిలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో పూజితకు స్థానం



గూడూరు అర్బన్, ఏప్రిల్ 22: టీడీపీ ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర కమిటీ(అదనం)లో గూడూరుకు చెందిన అరవ పూజితకు స్థానం లభించింది. సోమవారం టీడీపీ ప్రకటించిన కమిటీలో తిరుపతి జిల్లా నుంచి గూడూరుకు చెందిన అరవ పూజితకు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమిస్తూ ప్రకటించింది. దీంతో పలువురు టీడీపీ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎన్నారై టీడీపీ సెల్ ఇన్‌చార్జిగా పేరం



పెళ్లకూరు, ఏప్రిల్ 22: పెళ్లకూరు గ్రామానికి చెందిన ఎన్నారై పేరం వెంకటతేజను తెలుగుదేశం పార్టీ ఎన్నారై సెల్ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జీగా నియమించింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అమెరికాలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో పార్టీ నాయకులను సమన్వయ పరచి టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ విజయం కోసం కృషి చేస్తాననిట్లు వెంకటతేజ తెలిపారు.

రైలునుంచి పడి చెయ్యి కోల్పోయిన యువకుడు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 22: నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి జార్ఖండ్ యువకుడు చెయ్యి కోల్పోయాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన లల్లు కుమార్ మరో 9 మంది యువకులు కూలి పనుల నిమిత్తం చెన్నైకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఆదివారం అర్ధరాత్రి నాయుడు పేట రైల్వేస్టేషన్ సమీపంలోకి రైలు చేరుకుంటుండగా ప్రమాదవశాత్తు లల్లు కుమార్ జారి పడిపోవడంతో చెయ్యి పూర్తిగా తెగిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమిదే విజయం... చంద్రబాబే సీఎం




చిన్నన్నపేటలో గజమాలతో రామకృష్ణకు స్వాగతం - కురుగొండ్ల రామకృష్ణ ఎన్నికల ప్రచారం - లక్ష్మీసాయిప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వెంకటగిరి/ డక్కిలి, ఏప్రిల్ 22: ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిపల్లిలో జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజలు చూపుతున్న ఆదరణ చూస్తుంటే కూటమి అభ్యర్థుల విజయం ఖాయమైందన్నారు. జగన్‌ను కూలదోసేందుకే ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్నామని చెప్పారు. గడిచిన ఐదేళ్లల్లో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. జగన్ ముద్దలు పెట్టి తలనిమరడంతో ఏదో చేస్తారని ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే ప్రజలను పాతాళానికి తొక్కేశాడన్నారు. జగన్ మోసపు మాటలు విని మోస పోవద్దని కోరారు. భావితరాల భవిష్యత్తు కోసం చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అమరావతిని నిర్మించుకోగలమని లేదంటే రాజధాని రాష్ట్రంగా మిగిలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, తెలుగు యువత జాతీయ ప్రధాన కార్యదర్శి రవినాయుడు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకులు పప్పు చంద్రమౌళి రెడ్డి, తోట రామచంద్రయ్య, పులికొల్లు రాజేశ్వర రావు, నక్కల వెంకటేశ్వర్లు, గెరిటిచెంచయ్య యాదవ్, శివ, నాగరాజు, ప్రసన్న, గిరి, నాగార్జున, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

లక్ష్మీసాయిప్రియ


దళితుల ఆత్మీక సమావేశంలో లక్ష్మీసాయిప్రియ

దేశం మొత్త అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సీఎం జగన్ మోహన్ రెడ్డి తన తాత రాజారెడ్డి రాజ్యంగాన్ని అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం ఆమె పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దళితుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు దళితుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్, కార్పొరేషన్, వాహనాల పంపిణీ వంటి ఎన్నో పథకాలు అమలు చేసి దళితులను ఆర్థికంగా ఎదిగేలా చేశారన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసి వారికి తీరని ద్రోహం చేసిందన్నారు. పేరుకే దళిత కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి నిధులు విడుదల చేయకుండా కుర్చీలకే పరిమితం చేశారన్నారు. దళితులను ఏ ప్రభుత్వం అయితే ఆదుకుంటుందో వారికి అండగా నిలవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే దళితుల కోసం ప్రవేశ పెట్టిన పథకాలన్నింటినీ చంద్రబాబు తిరిగి తీసుకు వస్తారన్నారు. ఈ ఎన్నికల్లో తన తండ్రి రామకృష్ణకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాలాయపల్లి మండలం హస్తకావేరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు చేజర్ల నాగరాజు, ఎం.రామయ్య, జి.సునీల్ టీడీపీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, మాజీ కౌన్సిలర్లు చెంగారావు, మల్లారం బాబు, అరవ శ్రీదేవి, పుట్టా ఇందిరమ్మ, నాయకులు మేరిగ రామ కృష్ణ, నర్సింహులు, సుధ, రాపూరు శ్రీనివాసులు, వెంకటరమణ, మచ్చల వేణు, కొరపాటి రామచంద్రయ్యనాయుడు, కాపా శ్రీనివాసుల నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.